AL - HILAL

నెలవంక

హిలాల్ పత్రిక

Vol 8, Issue: 59 SEPTEMBER - 2011

مجلة الهلال (باللغة التلغوية) – ملحق مجلة البشرى

రమజాను పండుగ శుభాకాంక్షలు!




లైంగిక సంబంధాలు ప్రకృతి నియమాలు

IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية

جمعية النجاة الخيرية

telgo Septemper.indd 1 8/22/11 3:45 PM



IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية

22444117 EX:151 మాకు కాల్ చేయండి

సమస్త లోకాల పాలిట మూర్తీభవించిన కారుణ్యం http://ipcblogger.net/telugu/

Al-Roudaa	Al-Salmiya	Al-Sabahia	Al-Khaitan	Al-Mangaf	Al-Jahraa	Al-shohadaa	Main Branch
22511301	25733263	23620332	24711141	23723002	24558830	25231015	22444117

సామాజిక, సాంస్కృతిక, సందేశాత్మక మాస పత్రిక

నెలవంక

(AL-HILAL MONTHLY)

Vol 8, ISSUE: 59
SEPTEMBER 2011

CHIEF PATRON
Muhammad Ismail Ansari

GENERAL SUPERVISION
Khalid Al-Sab'a

EDITOR
Syed Abdus Salam Omeri

ASSOCIATE EDITOR
Sk. Habeebur Rahman Jamaee

EDITORIAL BOARD
Sk. Abdus Salam Omeri
Sk. MOHAMMED SALEEM JAMAEE
Sk. Muhammad Bilal
Tahera Begum

PHONE
Syed Abdus Salam Omeri
97248933

FAX
22400057


P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT

PUBLISHED BY
IPC
Islam Presentation Committee
Kuwait
www.ipc.org.kw

DESIGN
Nader Belal

مؤسسة زخرف للدعاية والإعلان
Zukhruf Advertising Agency
www.zukhruf.net
Tel. 99993072

ఈ సంచికలో....



పసిడి వరాల మిసిమితో...రమ్జాన్
రజిత ఫుష్ప పరిమళాలతో... పుణ్య
పచ్చ తోరణాల తో...మున్నింపు
మంచు బిందువు జల్లుతో మమ్మల్ని
అలరించిన ఓ రోజాల మాసమా! నీ
విరహా వేదనా సెగలు మమ్మల్ని
ఉక్కిరిబిక్కిరి చేస్తున్నా మందస్మిత
అధరాలతోనే అల్లవిదా!!
నీ తర్వాత షవ్వాల్ 6 ఉపవాసాలుం
టామని, నీ శిక్షణే రక్షణగా జీవిస్తామని
మాట ఇస్తున్నాము. వచ్చే ఏడాది మళ్ళీ
నీ చల్లని ఒడిలో సేద తీరే మహా
భాగ్యాన్ని అనుగ్రహించమని ఆ దయా
సాగరుణ్ణి వేడుకుంటున్నాము.



ఇంద్రియ నిగ్రహం



రమజాన్ వీడ్కోలు

ఇంద్రియ నిగ్రహం	2
రేపే ఈద్	3
మూడు ప్రశ్నలు మూడు సమాధానాలు	4
లైంగిక సంబంధాలుప్రకృతి నియమాలు	6
మహా గొప్ప శాస్త్రవేత్త ముహమ్మద్ (స)	10
ఇస్లాం శిక్షణ	12
ప్రాణం ఖరీదు రూపాయి	13
పూ పరిమళం	14
జ్ఞానామృతం	15
సర్వేంద్రియానం నయనం ప్రధానం	16
రమజాన్ వీడ్కోలు	18
ఐపిసి వార్తలు	20

ضبط النفس - العيد غداً - من أين جئنا وإلى أين مصيرنا - الحياة الإجتماعية وقوانين الفطرة - ماهر النفسيات محمد ﷺ - نشيد من هم الانبياء - تربية المهتدين - فكرة رائعة لخدمة الخلق - اختبر معلوماتك - جوامع الكلم - عظمة قدرة الله في العين - وداعاً يارمضان - انشطة اللجنة



దృక్పథం

ఇంద్రియ నిగ్రహం

ఆదిలో దేవుడు ఏ నాలుగు మూలతత్వములతో మనిషిని సృజించాడో అవి - మట్టి, నీరు, నిప్పు, గాలి. మానవులందరి నైజాలు, స్వభావాలు, ప్రతిభాపాటవాలు, నైపుణ్యత, నైతిక స్థాయి, ఆత్మశక్తి ఒకేలాగు ఉండవు. వాటి మీద ఈ నాలుగు మూలతత్వముల ప్రభావం ఏదోక స్థాయిలో తప్పకుండా పడుతుంది. వారిలో కొందరు పిరికివారు, బలహీనులైతే మరికొందరు బలవంతులు, సాహసవంతులై ఉంటారు. కొందరు మర్యాదస్తులు, ధర్మపరాయణులైతే, మరికొందరు గర్విష్ఠులు, పచ్చి స్వార్థపరులై ఉంటారు. కొందరు మృదుస్వభావులు శాంతి కాముకులైతే మరికొందరు కల్లోల జనకులు, కర్కశక హృదయులై ఉంటారు.కొందరు కరుణ గలవారైతే మరొకొందరు కోపిష్టులై ఉంటారు. ఏది ఏమైనా ఈ నాలుగు మూలతత్వముల ప్రభావఛాయలు ప్రతి మనిషిలోనోనూ గోచరిస్తాయి. ఇటువంటి వేర్వేరు స్వభావాలు, పరస్పర విరుద్ధ భావాలు గల వారు ఒకే సమాజంలో మనుగడ సాగించాలంటే, వారి మధ్య సోదభావం, సమరస భావం, సహిష్ణుత, సుహృద్భావం, త్యాగ భావం ఎంతో అవసరం. సమాజాభ్యున్నతి, అభివృద్ధికైనా ఇవి టానిక్కులాంటివి. ఈ గుణాలు ఎంత పుష్కలంగా ఉంటే సమాజంలో అదే స్థాయిలో శాంతి సుస్థిరతలు పరిఢవిల్లుతాయి. మనిషి - తన, ధన, మాన, ధర్మానికి రక్షణ ఉంటుంది.

సమాజంలో చోటు చేసుకునే అల్లరి అలజడులకు కారణాలు, ప్రేరణలు, కారకాలు అనేకం ఉన్నప్పటికీ ముఖ్యమైన కారణం క్రోధావేశం అనాలి. ఈ క్రోధావేశానికి దారి తీసే కారణాల్ని గనక మనం నిర్మూలించగలిగితే సమాజం శాంతి శ్రేయాలతో వర్ధిల్ల గలదని ఆశించవచ్చు. ఇక ఆ ప్రేరకాలు, కారణాలు ఏవంటారా -, ప్రకృతి స్వభావానికి విరుద్ధంగా నడుచుకోవడం, హక్కుల ఉల్లంఘన , అపహరణ, ద్రోహం, అవినీతి, మోసం, విశ్వాస ఘాతుకం, బర్బరత్వం, అమానుషత్వం, దుర్మార్గం, దౌర్జన్యం, వైరం, ద్వేషం, శత్రుత్వం, పరోక్ష నింద, చాడీలు చెప్పడం, అపనిందలు మోపడం, కూపీలు లాగటం, రంధ్రాన్వేషణ, అబద్ధం, మాట ఇచ్చి తప్పటం, వాగ్దాన ఉల్లంఘన, లజ్జారాహిత్యం, పరదూషణ, రెండునాల్కల ధోరణి, అనుమానం, అపార్థం మొదలైనవి. ఇవి కోపావేశానికి ఎలా కారణం అవుతాయి? అంటారా-

ప్రతి మనిషికి ఒక స్వభావం, ఒక తత్వం ఉంటుంది. దానికి భిన్నంగా ఏదైనా సంఘటన చోటు చేసుకున్నప్పుడు కోపం వస్తుంది. దేవుడు మనిషికి గౌరవోన్నతల్ని ప్రసాదించాడు. అతని ఆత్మాభిమానాన్ని దెబ్బ తీసే క్రియ, ప్రతి చర్య బహిర్గతమైనప్పుడు కోపం వస్తుంది. మనిషి దౌర్బల్యం గల దౌర్బల్యుడు. ఈ కారణంగానే ఒకరి అవసరం ఇంకొరికి ఉంటుంది. ఒండొకరి బలహీనతల్ని దూరం చేసి బలగాలను వృద్ధి పర్చడంలో అందరూ సమానంగా స్పందించాలి, సహరించాలి. అలాకాక ఎదుటి వ్యక్తి బలహీనుడు కదా అని హక్కుల ఉల్లంఘనకు పాల్పడితే కోపం వస్తుంది. ఇదే అక్రమార్జన పెచ్చరిల్లితే సహనం నశించి, విద్వేషాగ్ని జ్వాల పెల్లుబుకుతుంది. మనిషి స్వభావసిద్ధంగా అవినీతిని, అన్యాయాన్ని, మోసాన్ని, విశ్వాసఘాతుకాన్ని అసహ్యించుకుంటాడు. తత్ఫిన్నంగా న్యాయాన్ని, ధర్మాన్ని ఇష్టపడతాడు. ఎవరైనా తన పట్ల అమానుషత్వానికి, అన్యాయానికి ఒడిగడితే కోపం వస్తుంది. మనిషి స్నేహాన్ని, ప్రేమను కాంక్షిస్తాడు. ఎవరైనా తన పట్ల వైరభావంతో, పగతో, సెగతో శత్రత్వాన్ని ప్రదర్శిస్తే కోపం వస్తుంది. ప్రతి వ్యక్తిలోనూ ఏదో కొన్ని లోపాలుంటాయి. తన లోపాలు ప్రచారంలోకి రాకూడదని ప్రతి వ్యక్తీ అభిలషిస్తాడు. ఎవరైనా తన బలహీనతల్ని, లోపాల్ని ఇతరుల ముందు ప్రస్తావించినప్పుడు కోపం వస్తుంది. చేయని నేరానికిగాను నింద పడాల్సి వచ్చినప్పుడు కోపం వస్తుంది. మాటల గారడితో మోసం చేసినప్పుడు కోపం వస్తుంది. సిగ్గు, బిడియం మహా గొప్ప లక్షణం. సభ్యత, సంస్కారవంతుని పట్ల ఎవరైనా లజ్జా రాహిత్యంగా వ్యవహరించినప్పుడు కోపం వస్తుంది. ముందు ఒకవిధంగా ప్రవర్తించి, వీపు వెనకాల చెడు వాగడం వల్ల కోపం వస్తుంది. రెండు నాల్కల ఈ ధోరణి మహా దారుణమైన లక్షణం. అర్థరహితమైన అనుమానం అనర్థాలకి దారి తీస్తుందన్నట్లు మనిషి ఒకరి పట్ల లేనిపోని అనుమానాలకు పోయినప్పుడు కోపం వస్తుంది. మరి వీటన్నింటికి మూల బీజం ఏది అంటే- సమాధానం మనసు. కనుక మనిషి తన ఇంద్రియాలకు కేంద్ర బిందువు అయిన మనసును జయించగలిగితే సకల విధమైనటువంటి అవలక్షణాల్ని పరిత్యజించగలడు. సమాజానికి ప్రయోజనకారిగా మారగలడు. మహా ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: "జాగ్రత్త! మానవ దేహంలో ఒక ముద్ద ఉంది. అదిగనక బాగుంటే శరీరం మొత్తం బాగుంటుంది. అది గనక పాడైతే దేహం మొత్తం పాడైపోతుంది. గుర్తుంచుకోండి! అదే హృదయం".

రమజాను మాసం వచ్చింది. మనకు ఎన్నో వరానుగ్రహాల్ని ప్రసాదించిన ప్రబోధిక రమజాన్.. మహా గొప్ప శిక్షణను ఇచ్చిన ప్రభానము రమజాన్. అది మనకిచ్చిన శిక్షణలో ప్రబర్వమైనది-ముఖ్యమైనది ఇంద్రియ నిగ్రహం. మనం ఈ శిక్షణకు లోబడి మనం మన పంచేంద్రియాలపై, జ్ఞానేంద్రియాలపై, నవనాడులపై, సర్వ అవయవాలపై అదుపు సాధించగలిగితే మన జీవితం ప్రహర్షణము -ప్రహల్లాదము-ఆనందప్రదం కావడమేకాక, ఇతరుల్ని సయితం ప్రశమనము-ప్రశాంతి కలుగజేసినవారం అవుతాము. ముస్లిం అన్న నామానికి సార్థకత చేకూర్చిన వారంగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాము.

అబ్దుస్సలాం

telgo Septemper.indd 4 8/22/11 3:45 PM

మూలం– ఆయద్ అబ్దుల్లాహ్ అల్‌ఖర్నీ
తెలుగ రూపం – హాఫిజ్ రసూల్ షర్ఫీ

రేపే ఈద్



రేపే ఈద్. ఇవాళ రాత్రి తెల్లారితే రేపు ముస్లింలంతా పండుగ జరుపుకుంటారు. ఈద్ లేక పండుగ అంటే ఏమిటి? అది ఎలా ఉంటుంది? కొత్త బట్టలు వేసుకోవటం పండుగ కాదు. తన సిరిసంపదలు చూసుకొని మురిసిపోయే వ్యక్తికీ ఇది పండుగ కాదు. తీర్పు దినానికి, పరలోక న్యాయ సింహాసనాధిపతి అయిన అల్లాహ్‌కు భయపడుతూ జీవితం గడిపేవారిదే పండుగ.

ఈద్ అంటే సంగీతం, నృత్యాలు కాదు. అసభ్య ఆటపాటలు కాదు. వ్యర్థ మనోరంజక కార్యకలాపాలు కాదు. పైశాచిక ఆనందం, వికృత చేష్టలు అసలే కాదు. పండుగంటే కరుణామయుడైన అల్లాహ్ పట్ల కృతజ్ఞతలు తెలియజేయడం, ఆయన ప్రసాదించిన వరాలను గుర్తించటం, ప్రభువు కరుణాను గ్రహాలను ప్రదర్శించటం, విశ్వాసుల నమ్మకాలను స్థిర పరచటం, ఇస్లాం ధర్మాన్ని బల పర్చటం, శాంతి విఘాతకులు సృష్టించే అడ్డంకులను అవలీలగా తొలగించుకోవటం.

పండుగ రోజు కార్యక్రమాలు

ప్రతి ముస్లిం ఫిత్ర్ పండుగ నమాజుకు ముందు కొంత అల్పాహారం తీసుకోవాలి. అది ఉపవాస దీక్ష విరమణ సమయంలో తినే ఖర్జూర పండే కావచ్చు. ఇకపోతే, రమజాన్ నెలలో ఉపవాస దీక్ష విరమణ సమయంలో జరిగిన తప్పులకు, పొరబాట్లకు బదులుగా ఈ రోజు నిరుపేదలకు **'జకాతుల్ ఫిత్ర్'** దానం చెల్లించాలి. ఇది పేదల్లో సంతోషాన్ని తెస్తుంది. ముస్లింలలో పరస్పరం దయ, సహకార గుణాలను పెంపొందిస్తుంది. హృదయాలను శుద్ధి చేస్తుంది. వారిలో పిసినారి తనాన్ని అరికడుతుంది.

కొత్త బట్టలు ధరించటం, సువాసన పూసుకోవటం, పండుగ నాటి కార్యక్రమాలలోని అంతర్భాగమే. అల్లాహ్ కారుణ్యాన్ని అర్థం చేసుకునే సాధనమే పండుగ. అల్లాహ్ అత్యంత సుందరుడు. సౌందర్యాన్ని ఆయన ఇష్టపడతాడు. కనుక సింగారమూ పండుగలో అంతర్భాగమే! అల్లాహ్ అనుగ్రహాలను ప్రదర్శించే సమయమే ఈ పండుగ.

"అల్లాహ్ తన దాసునికి అనుగ్రహం ప్రసాదించినప్పుడు ఆ మనిషిపై తన అనుగ్రహం తాలూకు ప్రభావం కనిపించటాన్ని ఆయన ఇష్ట పడతాడు" అని దైవ ప్రవక్త (స) ప్రవచించి ఉన్నారు. పండుగ ఒకరినొకరు కలుసుకునే సమయం. అభినందనలు తెలుపుకునే సందర్భం. పరస్పరం ప్రేమాభిమానాలు పంచుకునే శుభ ఘడియ. కనుక పండుగ రోజు బంధుమిత్రులతో సంబంధాలు నెలకొల్పాలి. తల్లిదండ్రుల పట్ల ప్రేమానురాగాలు చూపాలి. పేదల పట్ల దయ కనబర్చాలి. పొరుగువారి పట్ల సానుభూతి కలిగి ఉండాలి. ఇస్లామీయ పండుగ ఈ విషయాలన్నిటినీ తన అనుయాయులకు పదే పదే ప్రబోధిస్తుంది.

ఇస్లామీయ పరిధుల్లో ఉంటూ ఆనంద సంబరాలను జరుపుకోవాలని ఇస్లామీయ పండుగ మనకు బోధిస్తుంది. ఇస్లామీయ పరిమితులకు లోబడి ఆహ్లాదాన్ని అనుభవించవచ్చుంటుంది. వినయవిధేయతలు నిండిన క్రీడలను, ఇతరులకు ఏ మాత్రం హాని కలిగించని ఆటల్ని ఆనందించమంటుంది. ధార్మిక పరిమితులను గౌరవిస్తూ విహార సంతోషాన్ని ఆస్వాదించమంటుంది. సృజనాత్మకతను పెంచే కథలు విని హర్షించమంటుంది. **"గొప్ప సమీకరణ దిన"**మైన పరలోక ప్రతిఫల దినాన్ని తలపించే మహత్తర సందర్భం ఇది. వేలాది మంది ధనవంతుల్ని, పేదవారిని, పెద్దలను, పిన్నలను, పాలకులను, అనందంలో ఉన్నవారిని, బాధలు అనుభవిస్తున్న వారిని ఒకచోట చేరుస్తుంది పండుగ రోజు.

ఈద్ అనేది అల్లాహ్ తరఫున బహుమతులు అందుకునే రోజు. పరిపూర్ణ విశ్వాసంతో, పుణ్యఫలాపేక్షతో ఉపవాసాలు పాటించిన వారికి, పండుగ ఓ గొప్ప బహుమానం. ఘనమైన విజయం. మహా కానుక. దీనికి భిన్నంగా ఉపవాస సమయంలో పాపాలు చేసి, అల్లాహ్ హద్దులనతిక్రమించి, ఆయన ఆజ్ఞల్ని నిర్లక్ష్యం చేసినవారు తమ తప్పు తెలుసుకొని పశ్చాత్తాప పడవలసిన దినమూ ఇదే. మరి అది ఏం తీవ్రమైన నష్టమో కదా?!

పండుగ రోజున నమాజు ముగించుకొని తిరిగి వచ్చేవారికి రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. ఒకరు – ఆ రోజు అల్లాహ్ తరఫున బహుమతులు పొంది ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకునేవారు. పరమ ప్రభువైన అల్లాహ్ ఇటువంటి వారిని ఉద్దేశించి, **"వెళ్ళండి, నేను మిమ్మల్ని క్షమించాను. మీరు నేనంటే ఇష్ట పడ్డారు. నేనూ మీరంటే ఇష్టపడ్డాను"** అని అంటాడు.

ఇక రెండవ వర్గం వారు రమజాన్ మాసపు సర్వ శుభాలూ పోగొట్టుకున్న దౌర్భాగ్యులు. వీరు నష్టాలతో, పరితాపంతో అన్నీ కోల్పోయి అసంతృప్తులై తిరిగి వస్తారు.

ఒకానొక పండుగ రోజు ఒక ప్రజా సముదాయం వ్యర్థ కార్యకలాపాల్లో మునిగి ఉంది. ఒక దైవభీతిపరుడు వారిని గమనించి, **"మీరు గనక రమజాన్ మాసం మంచి విధంగా గడిపి ఉంటే, అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలిపే విధానం ఇది కాదు. ఒకవేళ రమజాన్ మాసాన్ని మీరు అనవసర కార్య కలాపాల్లో గడిపి ఉంటే, కరుణామయుడైన అల్లాహ్ ఎదుట పశ్చాత్తాప పడవలసిన తీరు కూడా ఇది కాదు సుమా!"** అని వారికి బోధ పరచాడు.

కొంత మంది అరఫాత్ ప్రాంతం నుంచి గుర్రాలపై, ఒంటెలపై పరుగులు తీస్తున్నారు. ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (ర) వారిని చూసి, **"గుర్రాలు లేక ఒంటెలపై స్వారీ చేసి పరుగు పందెంలో గెలిచినవారు విజేతలు కారు. ఎవరి పాపాలయితే మన్నించబడ్డాయో వారే నిజమైన విజేతలు"** అని చెప్పారు.

ఓ ముస్లిం! గత సంవత్సరం నీతోపాటు ఈద్ నమాజ్ చేసిన వారిని కాస్త గుర్తు తెచ్చుకో. వారిలో నీ తాతలు, తండ్రులు, నీవు ప్రేమించినవారు,నీ బంధుమిత్రులూ ఉన్నారు కదూ! వారిలో కొందరూ ఇప్పుడు ఎక్కడ ఉన్నారు? ఏమైపోయారూ? రేపు నీకు బహుమతి ఇవ్వబడనుంది. రేపు నీ కర్మల పత్రంలో నీ ఆచరణకు పరిపూర్ణ ప్రతిఫలం దాయబడుతుంది. అందులో కేవలం మంచి మాత్రమే నమోదు చేయబడేందుకు గట్టిగా కృషి చేయి సుమా! అల్లాహ్ అనుగ్రహాన్ని, ఆయన మన్నింపును, ఆయన క్షమాభిక్షను పొంద గలిగే రేపటి గొప్ప పండుగ దినం కోసం ఎదురు చూడు మరి!

"ప్రతి ప్రాణీ మృత్యువు రుచి చూడవలసిందే. ప్రళయ దినాన మీరు అందరూ మీ కర్మల పూర్తి ఫలితాన్ని పొందుతారు. అప్పుడు ఎవడు నరకాగ్ని నుంచి కాపాడబడి, స్వర్గంలో ప్రవేశం కల్పించబడతాడో అతడు నిశ్చయంగా సఫలీకృతుడయ్యాడు. ప్రాపంచిక జీవితమైతే ఒక మాయావస్తువు తప్ప మరేమీ కాదు సుమా!" (ఖుర్‌ఆన్-3: 185)

telgo Septemper.indd 5 8/22/11 3:45 PM



మూడు ప్రశ్నలు మూడు సమాధానాలు

ఈ ప్రపంచం అనేక మతాల. సమాజాల, జాతుల, తెగల కూడలి. ఇక్కడ క్రైస్తవులూ ఉన్నారు, యూదులూ ఉన్నారు, హిందువులూ ఉన్నారు, సాబియాలూ ఉన్నారు, ఫారసీయులూ ఉన్నారు, నాస్తికులూ ఉన్నారు, ఆస్తికులూ ఉన్నారు, లౌకిక వాదులూ ఉన్నారు, ముస్లింలూ ఉన్నారు. ఈ ప్రపంచంలో అనాది నుండి మనిషి ఎదుర్కొంటున్న ప్రశ్నల్లో ముఖ్యమైనవి మూడు. ఈ ప్రశ్నలు నాటి నుండి నేటి వరకూ మానవ మేధను పరీక్షిస్తూనే వస్తున్నాయి. నేడు సయితం అనేక మంది మేధావులు ఈ మూడు ప్రశ్నలకు సమాధానం వెతకడంలో తలమునకలై ఉన్నారన్నది వాస్తవం. మానవ జీవితంలో కీలక పాత్ర పోషించే ఆ మూడు ప్రశ్నలు –

1) మనం ఎక్కడ నుంచి వచ్చాము?
2) మనం ఎందు కోసం వచ్చాము?
3) చివరి మన గమ్యస్థానం ఏది?

ఇప్పుడు మీ వంతు. ఈ మూడు ప్రశ్నలకు మీ మేధ ఏం సమాధానం చెబుతుందో కాసేపు చదవడం ఆపి ఆలోచించండి. ఈ మూడు ప్రశ్నలకు ముందు మీరు సమాధానం తెలుసుకునేందుకు ప్రయత్నించండి. ఆ సమాధానం సరైనది–సహేతుకం కావచ్చు, నిర్హేతుకం కావచ్చు. ఎలా ఉన్నా పర్వా లేదు ఆలోచించండి. మీకు కాస్త సమయం ఇవ్వబడుతోంది.

జ).....
.....
.....
.....
.....
జ).....
.....
.....
.....
.....
.....
జ).....
.....
.....
.....
.....

మానవ సమాజంలోని అనేక మంది పండితా గ్రేసరులకు అంతుబట్టని ఈ మూడు ప్రశ్నలకు ఇస్లాం సంపూర్ణ సమాధానం – సూటిగా, ప్రతి మనిషి మనసులో దిగబడేలా, స్పష్టంగా, ప్రతి వ్యక్తి మేధకు అర్థమయ్యేలా బోధ పరుస్తుంది. అదెలాగా అని ఆలోచిస్తున్నారా? అయితే ఈ పూర్తి వ్యాసం చదవాల్సిందే!



1) మనం ఎక్కడ నుంచి వచ్చాము?

జ)"నిశ్చయంగా మేము మనిషిని మట్టి సారంతో సృష్టించాము".(అల్ మోమినూన్: 12-14)

మట్టితో సృజించడం అంటే ఆది మానవుడైన ఆదం (అ)ను మట్టితో చేయడం. మనందరికి మూల పురుషుడు హజ్రత్ ఆదం(అ) అయితే, ఆయన మూలం మట్టి. తర్వాత ఏం జరిగింది?

'అలస్తు' ప్రమాణం

'నీ ప్రభువు ఆదం సంతతి వీపుల నుండి వారి సంతానాన్ని తీసి, స్వయంగా వారినే వారికి సాక్షులుగా పెట్టి, 'నేను మీ ప్రభువుని కానా?' అని అడిగినప్పుడు– **'ఎందుకు కావు? (నువ్వే మా ప్రభువువి). ఈ విషయానికి మేమంతా సాక్షులుగా ఉన్నాం'** అని వారు చెప్పారు.'

(అల్ ఆరాఫ్: 172)

పై పేర్కొనబడిన సంఘటన **'అలస్తు ప్రమాణం'**గా సుప్రసిద్ధం. దీని వివరాలు ఒక హదీసులో ఉన్నాయి. "....ఆదం వీపు నుండి, ఆయనకు పుట్టబోయే సంతానమంతటిని ఒక్క సారిగా వెలికి తీసి, వారిని **'అలస్తు బిరబ్బికుమ్?** – నేను మీ ప్రభువుని కానా?' అని ప్రశ్నించాడు. **'బలా షహిద్నా'** – నువ్వే మా ప్రభువువి. దీనికి మేమంతా సాక్షులం' అని వారు బదులిచ్చారు". (ముస్నదె అహ్మద్)

ఇది ఏ లోకంలో జరిగింది? ఇది **'ఆలమె జర్'**– పరమాణువుల లోకం అనబడుతుంది. మొత్తం మీద ఈ సృష్టికి కర్త ఉన్నాడు, ఆయన ఒక్కడే అన్న భావన ప్రతి మనిషి నైజంలోనూ ఇమిడి ఉంది. ఈ ప్రకృతి సిద్ధ భావాన్నే మహా ప్రవక్త (స) ఈ విధంగా స్పష్టపర్చారు: **"పుట్టే ప్రతి శిశువు సహజత్వం (ప్రకృతి నైజం) పైనే పుడుతుంది. కాకపోతే దాని తల్లిదండ్రులు ఆ శిశువును యూదునిగానో, క్రైస్తవునిగానో, మజూసీగానో మార్చి వేస్తారు. జంతువు ఈనినప్పుడు దాని పిల్ల సయితం సురక్షితంగా ఉంటుంది. దాని ముక్కుగానీ, చెవులగానీ కోయబడి ఉండవు".**

(సహీహ్ బుఖారీ)

ఆది మానవుడైన ఆదం మట్టితో సృజించబడ్డారు అంటే మనమంతా అదే రీతిన మట్టితోనే పుడుతున్నామా అంటే కాదు అన్నది సమాధానం. మరి మన పుట్టుక ప్రక్రియ ఎలా జరుగుతుంది? అంటారా. చూడండి: **"మరి మిమ్మల్ని మట్టితో మేమే సృష్టించాము. ఆ తర్వాత వీర్యపు బొట్టుతో, ఆపైన గడ్డకట్టిన రక్తంతో, అటుపిమ్మట మాంసం ముద్దతో చేశాము. అప్పటికీ అది రూపం కలదిగానూ, రూప రహితమైనదిగానూ ఉన్నది. మేము మీకు సృష్టి రహస్యాలు తెలియజెప్పేందుకు (ఇదంతా చేస్తున్నాము). మరి మేము కోరిన**

telgo Septemper.indd 6 8/22/11 3:45 PM

దానిని నిర్ధారిత సమయం వరకు మాతృ గర్భాలలో ఉంచుతున్నాము. ఆ తర్వాత మిమ్మల్ని శైశవ దశలో బయటికి తీస్తాము. మరి మీరు నిండు యౌవనానికి చేరుకోవ టానికి మీలో కొందరు (యుక్త వయసుకు చేరుకోక ముందే) మృత్యువుకు గురి చేయ బడతారు. మరి కొందరు అన్నీ తెలిసి ఉండి కూడా ఏమీ గ్రహించలేనంత నికృష్టమైన వయస్సుకు చేర్చబడతారు". (అల్ హజ్జ్: 5)

"నిశ్చయంగా మేము మనిషిని మట్టి సారం తో సృష్టించాము. ఆ తర్వాత అతన్ని వీర్య బిందువుగా చేసి ఓ సురక్షితమై చోటులో (లోకం మొత్తంలో శిశువు కోసం మాతృ గర్భంకన్నా సురక్షితమైన చోటు మరొకటి లేనేలేదు) నిలిపి ఉంచాము. మరియు ఆ వీర్య బిందువును ఘనీభవించిన రక్తంగా చేశాము. మరి ఆ రక్తపు గడ్డను మాంసపు ముద్దగా మార్చాము. దరిమిలా ఆ పిండాన్ని ఎముకలు గా చేశాము. పిదప ఆ ఎముకలకు మాంసం తొడిగించాము. అటుపిమ్మట దాన్ని పూర్తి భిన్నమైన సృష్టిగా ప్రభవింపజేశాము. అందరి కన్నా ఉత్తమ సృష్టికర్త అయిన అల్లాహ్ ఎంతో శుభకరుడు". (అల్ మోమినూన్:12-14)

"మేము మానవుణ్ణి అందమైన-అత్యుత్తమమైన ఆకృతిలో సృజించాము" (అత్తీన్:4) అన్న దివ్య సూక్తి దృష్ట్యా- మానవ జన్మ అపురూప మైనది. ఇలాంటి సృజన కేవలం ఒక్క అల్లాహ్‌కు మాత్రమే సాధ్యం. ప్రపంచంలోని వస్తు నిర్మాతలెవరూ ఇలాంటి సృష్టి ప్రక్రి యను సాగించలేరు అని తెలుస్తుంది.



మరి ఆత్మ ఎక్కడి నుండి వస్తుంది? అని ఆలోచిస్తున్నారా?! సూరయె సజ్దాలో ఇలా సెలవియ్యబడింది:

"ఆయన ఏ వస్తువు చేసినా చాలా చక్కగా చేశాడు. మానవ సృష్టిని మట్టితో మొదలు పెట్టాడు. ఆతర్వాత అతని సంతతిని అత్యంత అల్పమైన నీటి సారం (వీర్యం)తో కొనసాగిం చాడు. ఆ పిదప తగు రీతిలో దానిని మలచి, అందులో తన వద్ద నుండి ఆత్మను ఊదాడు. మరి ఆయనే మీ చెవులను, కళ్ళను, హృద యాలను చేసాడు. (అయినా) మీరు కృతజ్ఞ తలు తెలుపుకునేది చాలా తక్కువే".

(అస్సజ్దహ్: 7-9)

"సుదీర్ఘమైన కాలంలో మానవుడు చెప్పుకోదగ్గ వస్తువుగా లేకుండిన సమయం ఒకటి గడవ లేదా? నిశ్చయంగా మేము మానవుణ్ణి పరీక్షి ంచడానికి ఒక మిశ్రమ వీర్య బిందువుతో పుట్టించాము. మరి మేము అతన్ని వినే వాడుగా, చూసేవాడుగా చేశాము".

(దహర్: 1,2)

ఆ వీర్య బిందువు ఎక్కడ తయారవుతుంది అంటే- అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: **"ఇక మానవుడు తాను దేంతో పుట్టించబడ్డాడో చూసుకోవాలి. అతను ఎగిసిపడే నీటితో పుట్టించబడ్డాడు. అది (పురుషుని) వెన్ను ముక, (స్త్రీ) ఛాతి భాగం మధ్య నుండి వెలు వడుతుంది".** (తారిఖ్: 5,6)

ఇవి, ఇటువంటి అనేక ఆయతుల ద్వారా స్పష్టమయ్యేది ఏమిటంటే, ఒకప్పుడు మనిషిపై ఏమి కాని శూన్య దశ కూడా ఒకటి ఉండేది. అల్లాహ్ అతన్ని శూన్య స్థితి నుండి మట్టితో, తర్వాత నీటి సారంతో, తర్వాత పై పేర్కొన్న విధంగా పుట్టించాడు. అంటే మనిషి ఉనికి ఏదో యాదృచ్ఛిక విస్ఫోటనం వల్ల జరగలేదు, మనిషిని, సకల సృష్టతాలను పుట్టించినవాడు అల్లాయేనని తెలుస్తుంది. అంటే మనిషి అసలు స్థితి ఏమిటో, అతని ఉనికి ఎలా ప్రారంభమై, ఏ విధంగా పూర్ణ స్థాయికి చేరు కుందో సమాధానం లభించింది. మరి ఎంతో మహోత్కృష్టమైన మానవ సృష్టి ఎందు నిమిత్తం జరిగింది అంటే **"మేము మిమ్మల్ని ఏదో అషామాషీగా (అర్థరహితంగా) సృష్టిం చామనీ, మీరు మా దగ్గరకు మరలిరావడ మనేది జరగని పని అని భ్రమపడుతు న్నారా?"** (అల్‌మోమినూన్:115)

"(ఆ విషయానికొస్తే) మేము భూమ్యాకాశాల ను, వాటి మధ్యనున్న వాటిని-ఏ ఒక్కటిని లక్ష్యరహితంగా పుట్టించ లేదు. (యాదృచ్ఛి కంగా పుట్టాము అంతే) అన్నది అవిశ్వాసుల-నాస్తికుల భ్రాంతి మాత్రమే". (స్వాద్: 27)

ఈ దివ్య సూక్తులలో మనిషిని పుట్టించిన అల్లాహ్ ఇతర సృష్టితాల మాదిరిగానే అతని జీవితానికి సయితం ఒక లక్ష్యం పెట్టాడని తెలుస్తోంది.

2) మనం ఎందు నిమిత్తం వచ్చాము? మన జీవిత లక్ష్యమేమిటి?

మనం ఒక కలమును తయారు చేస్తాము. రాయడం దాని లక్ష్యంగా పెడతాము. అంటే కలం ఉత్పత్తిదారులమైన మనం దాని లక్ష్యా న్ని నిర్ధారించినట్లే మనల్ని శూన్యం నుండి ఉనికిలోకి తీసుకు వచ్చిన దేవుడే మన జీవిత లక్ష్యాన్ని ఖరారు చేయాలి. అలా జరిగిందా? అంటే, చూడండి:



"నేను జిన్నాతులను, మానవులను సృష్టిం చింది వారు నన్ను ఆరాధించడానికి మాత్రమే. నేను వారి నుండి జీవనోపాధి (వజ్ర వైఢూ ర్యాలు, బంగారు వెండి ఆభరణాలు, వాహన, నివాస సౌకర్యాలు)ని కోరడం లేదు. వారు నాకు అన్నపానీయాలు (నైవేద్యాలు) పెట్టాలని కూడా నేను కోరడం లేదు. నిశ్చయంగా అల్లాహ్‌యే సకల జీవరాసులకీ స్వయంగా ఉపాధిని సమకూర్చేవాడు. ఆయన మహా శక్తిశాలి, మహాబలుడు".

(జారియాత్: 56- 58)

మానవులను, జిన్నాతులను పుట్టించడంలోని తన ఉద్దేశ్యమేమిటో అల్లాహ్ ఈ వాక్యాలలో విశద పర్చాడు. వారంతా తనను మాత్రమే ఆరాధించాలి, తనకు మాత్రమే విధేయత చూపాలన్నది ఆ విశ్వకర్త అభిమతం. అయితే దాని కోసం ఆయన మనుషులను గానీ, జిన్నాతులనుగానీ కట్టుబానిసలుగా చేయలేదు. వారి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను హరించలేదు. ఒకవేళ అదే గనక అయి వుంటే- మనుషులు, జిన్నాతులు తమకు ఇష్టం ఉన్నా, కష్టం ఉన్నా ఏకదైవారాధనకు చచ్చినట్టు కట్టుబడి ఉండేవారు. కానీ అల్లాహ్ వారికి పరిమిత స్వేచ్ఛ ఇస్తూనే తనను ఆరాధించమని కోరాడు. వారి పుట్టు కలోని పరమార్థాన్ని, వారి జీవిత లక్ష్యాన్ని వారికిక్కడ జ్ఞాపకం చేశాడు. అంతే కాకుం డా, తనకు ఎలాంటి ఉపాధి అవసరం గానీ, గుడి, గోపుర ఆవశ్యకతగానీ, నగానట్రా అవ సరంగానీ లేదని, తనకు నైవేద్యాల, ఆహార పానీయాల అవసరం అంత కన్నా లేదని ఉద్ఘాటించాడు. పైగా తానే సకల జీవరాసుల కు ఉపాధిని ప్రసాదిస్తున్నానని కూడా సృష్ట పర్చాడు. అంటే మనం 'తిన్నామా, పడుకు న్నామా, తెల్లారిందా' అన్నట్టు లక్ష్యరహితం గానూ పుట్టలేదు. అలాగే దైవం పేరు చెప్పు కొని గుళ్ళుగోపురాలు కట్టి, వజ్రవైఢూర్యా లు, బంగారు వెండి ఆభరణాలు సమర్పిం చడానికి లేదా కూడ బెట్టుకోవడానికీ పుట్ట లేదు. మన పుట్టుక కేవలం మనందరి సృష్టి కర్త అయిన అల్లాహ్‌ను మాత్రమే ఆరా ధించే నిమిత్తం జరిగింది.

(మిగతాది పేజీ 17లో)

telgo Septemper.indd 7 8/22/11 3:49 PM

"వ్యభిచార దరిదాపులకు కూడా పోకూడదు సుమా! అది ఎంతో నీతిబాహ్యమైన చేష్ట. మహా చెడ్డ మార్గం". (బనీ ఇస్రాయీల్: 32)
ఒక్కసారి వ్యభిచారం, దాని పరిణామాలను గురించి ప్రశాంతంగా ఆలోచించండి. మన సామూహిక జీవితంపై, సమాజంపై అదెలాంటి దుష్ప్రభావాన్ని వేస్తుందో పరిశీలించండి.

లైంగిక సం
ప్రకృతి నిం

1



ప్రథమంగా వ్యభిచారి తనను సుఖరోగాలకు గురిచేస్తాడు. తద్వారా తన శారీరక శక్తుల కార్యాచరణలో లోపాన్ని సృష్టించుకోవటమే కాదు, సమాజానికి, సంతతికి తీరని నష్టం కూడా కలిగిస్తాడు. సెగరోగం లేక పాండు రోగాన్ని గురించి ఏ వైద్యున్నైనా అడిగి చూడండి. మర్మాంగంలో ఏర్పడిన పుండు సామాన్యంగా నయం కానిది. ఒక గొప్ప డాక్టర్ లోకోక్తి ఏమిటంటే **"ఒకసారి సోకిన సెగ రోగము శాశ్వతమైన రోగము."** దీనివల్ల కాలేయము, మూత్ర కోశము మొదలగు అవయవాలు కూడా కొన్ని సందర్భాల్లో దెబ్బ తింటాయి. ఇది కీళ్ళ నొప్పులు, ఇతర రోగాలకు కారణ భూతమవుతుంది. వ్యభిచారం వల్ల శాశ్వతంగా గొడ్డుతనం ఏర్పడే ప్రమాదముంది. అంతేకాక ఇది ఇతరులకు సోకే ప్రమాదమున్న రోగం కూడాను. మరికొన్ని సుఖరోగాల ప్రభావాలయితే ఇంకా తీవ్రంగా, భయంకరంగా ఉంటాయి. అవి రోగి నుండి ఇతరులకు కుడా పాకిపోతాయి. ఇలా ఈ దుర్మార్గుడి మూలంగా అతని సంతానం, ఆ సంతానపు సంతానం కూడా, చేయని నేరానికి శిక్ష అనుభవించవలసివస్తుంది. అంధులు, మూగ, చెవిటి, మతిలేని పిల్లల జననం-దౌర్జన్యకారుడైన తండ్రి, తన జీవితపు మధురానుభూతులు అనుకొని గడిపిన ఆ కొద్ది క్షణాల దుష్ఫలితాలే.

2

సుఖరోగాలు ప్రతి వ్యభిచారికి సోకడం తప్పనిసరి కాకపోయినా ఈ చర్యతో అనివార్య సంబంధమున్న నైతిక బలహీనతల నుండి మాత్రం ఎవరూ తప్పించుకోలేరు. అశ్లీలం, మోసం, కాపట్యం, అబద్ధం, అవినీతి,స్వార్థం, భోగలాలస, నిగ్రహలోపం, ఆలోచనల్లో పోకిరి తనం, నడవడికల్లో చంచలత్వం, ముఖం చాటేసుకోవటం, విశ్వాసఘాతుకం- ఇవన్నీ వ్యభిచారానికి సంబంధించిన నైతిక రుగ్మతలు. ఇవి వ్యభిచారి మనోమస్తిష్కాలపై ప్రభావం వేయకుండా ఉండజాలవు. ఏ వ్యక్తిలో ఈ దుష్ట గుణాలు చోటుచేసుకుంటాయో అవి కేవలం లైంగిక విషయాల వరకే పరిమితమై ఉండవు. జీవితంలోని ప్రతి రంగంలో ఆ వ్యక్తి తన సంఘానికి ఈ గుణాలనే, వాటి ప్రభావాలనే సమర్పించుకుంటాడు.ఒకవేళ పైన పేర్కొన్న గుణాలు సమాజంలోని అత్యధిక మందికి కనుక సోకినట్లయితే అవి కళ, సాహిత్యం, వినోద క్రీడలు, పరిశ్రమలు, సంస్కృతి, ఆర్థికత్వము, రాజకీయము, న్యాయ వ్యవస్థలు, సైనిక సేవలు, రాజ్య వ్యవహారాలు- ఒక్కటేమిటి, సర్వ రంగాలను నిర్వీర్యం చేసి పడేస్తాయి. ప్రత్యేకించి ప్రజాస్వామ్యవ్యవస్థ లోనైతే.....

3



వ్యభిచారాన్ని అనుమతించటమంటే సమాజంలో వేశ్యవృత్తి సాగకుండా ఉండదు. ఒక వ్యక్తి, యువకుడైన పురుషునికి **'వినోదం'** హక్కు ఉండాలని చెప్తున్నాడంటే దాని అర్థం సామూహిక జీవితంలో, సాంఘిక జీవితంలో అత్యంత నీచమైన పడుపువృత్తిని అవలంబించే స్త్రీల వర్గం ఒకటి ఉండి తీరాలన్న మాట. అయితే ఈ స్త్రీ వర్గం ఎక్కడి నుండి ఊడి పడుతుంది? ఈ సమాజం నుండే రావాలి కదా! సమాజంలోని ఎవరో ఒక పురుషుని బిడ్డనో, చెల్లినో కాక తప్పదు. ఒక ఇంటికి యజమానురాలు, ఒక కుటుంబానికి స్థాపకురాలు, అనేకమంది పిల్లలకి సంరక్షకురాలు కాగలిగిన ఇలాంటి లక్షలాది స్త్రీలనే ఈడ్చుకు వచ్చి ఈ వేశ్య బజారులో కూర్చోబెట్టాలి కదా! మునిసిపాలిటి మూత్రశాలల్లో ఇష్టం వచ్చిన వారు అవసరమనుకున్నప్పుడల్లా వెళ్ళినట్లు తమ కామవాంఛను తీర్చుకునే దుష్ట పురుషుల అవసరాలు తీర్చే కేంద్రాలుగా మార్చటమే కదా! దీని ద్వారా స్త్రీ తనలో ఉన్న సుగుణాలన్నిటినీ కోల్పోక తప్పదు. వారికి వయ్యారం,కుటిల మనస్తత్వం నేర్పటం జరుగుతుంది. తమ ప్రేమ, హృదయం, శరీరం, అందచందాలు-సర్వస్వాన్ని ఒక్కొక్క గంటకు ఒక్కొక్క వినియోగ దారునికి అమ్ముకోవటానికి తగిన విధంగా వారిని మార్చటం జరుగుతుంది. ఈ విధంగా స్త్రీ, ప్రయోజనకరమైన కుటుంబ వ్యవస్థ నిర్వాహకురాలు కావడానికి బదులు జీవితాంతం పరపురుషుల కామవాంఛను తీర్చే కీలుబొమ్మలుగా మార్చబడుతుంది.

4

వ్యభిచారాన్ని అనుమతిస్తే అది తప్పకుండా సామాజిక నియమమైన వివాహ వ్యవస్థను నష్టపరిచి తీరుతుంది. ఇంకా చెప్పాలంటే దీని అంతిమ పర్యవసానంగా వివాహ వ్యవస్థ పూర్తి గా నశించిపోయి కేవలం వ్యభిచారమే విశ్వ రూపం దాల్చి సమాజంలో రాజ్యమేలుతుంది. వ్యభిచారం పట్ల మోజు కలిగిన స్త్రీ పురుషుల్లో నిజమైన దాంపత్య జీవితం గడిపే యోగ్యతే ఉండదు. వ్యభిచార వ్యసనం వల్ల ఉత్పన్నమయ్యే చెడు దృష్టి, చెడు తలంపు, చంచలత్వం పోకిరితనం లాంటి దుర్గుణాలు, తద్వారా వారి ఆలోచనల్లో అనిశ్చలత, భోగలాలస, నిగ్రహ లోపంలాంటి బలహీనతలు చోటు చేసుకుంటాయి. ఒకవేళ ఇలాంటి వ్యక్తుల జీవితం దాంపత్య జీవితంలో

telgo Septemper.indd 8 8/22/11 3:52 PM

ంబంధాలు ియమాలు

- మౌలానా అబుల్ ఆలా మౌదూదీ (ర)

ముడిపడి పోయినా దంపతుల మధ్య దాంపత్య జీవితానికి అవసరమైన పరస్పర ప్రేమ, అభిమానం, విశ్వాసము, సహకారం, సానుభూతులు చోటు చేసుకోలేవు. ఇవి ఉంటేనే మంచి భావితరం, ఆనందోత్సాహాలు వెల్లి వెరిసే కుటుంబం ఉనికిలోకి వస్తుంది. ఇంకొక విషయం, వ్యభిచారానికి అనువైన వాతావరణం నెలకొనే చోటున లేక సమాజంలో సమాజ బాధ్యతలతో కూడిన వివాహవ్యవస్థ లేక కుటుంబ వ్యవస్థ మనగలజాలదు. ఒక వ్యక్తికి ఎలాంటి బాధ్యతలు లేకుండానే తన కామవాంఛలు తీర్చుకునే అవకాశ మున్నప్పుడు అతడెందుకు వివాహం చేసుకొని తన భుజాలపై బాధ్యతల బరువును వేసుకుంటాడు? ఈ కారణంగానే పాశ్చాత్యదేశాల్లో ప్రత్యేకించి యూరోపియన్ సమాజాల్లో వివాహ వ్యవస్థ కుంటు పడి పోయింది. కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమైపోయింది.

5 వ్యభిచారానికి అనుమతించటం, ఆచారమివ్వటం మూలంగా కేవలం సాంఘిక పతన మొక్కటే కాదు, మానవజాతి ఉనికికే ప్రమాద మేర్పడుతుంది. ఈ విషయాన్ని పైన రుజువు పరిచాము. విచ్చలవిడి లైంగిక సంబంధాల్లో స్త్రీపురుషులిద్దరికి కూడా సంతానోత్పత్తి లేక మానవజాతి మనుగడ గురించిన కోరిక ఉండదు, ఉండజాలదు కూడా.

6



వ్యభిచారం వల్ల సమాజానికి అసలు శిశువులే లభించరు. లభించినా వారు అక్రమ సంతానంగానే లభిస్తారు. వంశపరంగా అక్రమ, సక్రమ అనేది కేవలం ఒక మానసిక భావన తప్ప ఇంకేమి కాదని కొందరు అజ్ఞానులు భావిస్తారు. నిజానికి అనేకానేక కారణాల మూలంగా అక్రమ సంతానానికి జన్మనివ్వటం అంటే ఆ శిశువుపై, సర్వ మానవ సమాజంపై ఒక ఘోరమైన అన్యాయం, దౌర్జన్యం చేయడమే. తల్లిదండ్రులిద్దరూ కేవలం పాశవిక ఉద్రేకంలో మునిగి ఉన్న సమయంలోనే ఈ శిశువుకు తల్లి గర్భంలో అంకురార్పణ జరుగుతుంద నేది మొదటి విషయం. వివాహబంధంతో ముడి పడి ఉన్న ఒక జంటలో సంభోగ సమయంలో ఉండేటట్లు వంటి పవిత్ర మానవీయ విలువలు ఈ అక్రమ లైంగిక సంబంధం ఏర్పర్చుకున్న జంటలో ఎట్టి పరిస్థితుల్లోను ఉత్పన్నం కాజాలవు. వారిని కేవలం పాశవిక ఉద్రేకం మాత్రమే కలిపేస్తుంది. అందుకని ఆ సమయంలో వారిలో ని మానవీయ ప్రత్యేకతలన్నీ పటాపంచలై పోతాయి. తత్ఫలితంగా అక్రమంగా జన్మించిన ఆ శిశువు తన తల్లిదండ్రుల పాశవిక వారసత్వానికే అర్హుడవుతాడు. ఇక ప్రపంచంలోకి వచ్చిన ఆ శిశువును స్వాగతించటానికి తల్లిగాని, తండ్రిగాని సిద్ధంగా ఉండరు. ఎందుకంటే అతనొక కోరబడిన, అభిలషించిన, ఎదురు చూస్తున్న ఉనికి కాదు. అనాలోచితంగా, అయిష్టంగా,గత్యంతరంలేక మెడలో వచ్చి పడిన పాములాంటి వాడు. సాధారణంగా ఇలాంటి పిల్లలకు తండ్రి ప్రేమకాని, అతని వనరులు కాని లభించవు. తల్లి ఏకపక్ష ప్రేమ, రక్షణే అతనికి దిక్కు. ఆ ప్రేమలో కూడా విసుగు, అయిష్టత ప్రస్ఫుటంగా కనబడుతాయి. అతను అవ్వ, తాతయ్యల ప్రేమ వాత్సల్యాలకు కూడా నోచుకోలేడు. కుటుంబ సంరక్షణ, ప్రేమ అంటే ఏమిటో అతనెరుగడు. అందుకని అతనొక అసంపూర్ణ వ్యక్తిగా, లోపభూయిష్టమైన వ్యక్తిగానే ఎదుగుతాడు. అతనికి సరియైన శిక్షణ దొరకనందు వలన అతని క్యారక్టర్ పరిపూర్ణం కాజాలదు. అతనిలోని యోగ్యతలు వికసించవు. సమాజంలో తగిన విధంగా పురోగమించటానికి, సముచిత స్థానం పొందటానికి కావలసిన ఒనరులు అతనికి లభ్యంకావు. అందువల్ల అతను లోపభూయిష్టంగా, అనాథగా, అపరిచితునిగా, పీడితునిగా, దూషితునిగా సంఘంలో అడుగు పెడతాడు.

విశృంఖల లైంగిక సంబంధాల ధ్వజవాహకులు దీన్ని గురించి వితండ వాదం చేస్తూ ఇలాంటి పిల్లల పోషణ, విద్యాబుద్ధుల కోసం ఒక జాతీయ వ్యవస్థ ఉండాలని, తల్లిదండ్రులు తమ ఇష్టానుసారం కనిన పిల్లల్ని జాతి పెంచి పోషించి, సామాజిక సేవకోసం తర్ఫీదునివ్వాలని అంటారు. స్త్రీ పురుషులకు లైంగిక స్వాతంత్ర్యం, వ్యక్తి గత స్వేచ్ఛ ఉండి, వారు వైవాహిక జీవితం లో బంధింపబడకుండానే తమ లైంగిక కోరికలు తీర్చుకుంటూ తత్ఫలితంగా జన్మించిన శిశువులకు ఈ విధంగా శిక్షణ ఇస్తే మానవ సంతతీ పెరుగుతుంది; దాని శిక్షణ పూర్తి అవుతుందని వారి భావన. అయితే విచిత్రమైన విషయం ఏమిటంటే ఇటువంటి వారికి ప్రస్తుత తరం వ్యక్తి గత స్వాతంత్రమైతే ఇంతగా ప్రీతి పాత్రమైనది, కాని రాబోయే తరానికి వారు వ్యక్తిగత పురోగాభివృద్ధికి, వ్యక్తిత్వ వికాసానికి ఎలాంటి అవకాశం లేని జాతీయ వ్యవస్థ, ప్రభుత్వ పోషణ, శిక్షణా వ్యవస్థలను కోరుతున్నారు. లక్షలాది పిల్లలకు ఏక కాలంలో ఒకేరీతిలో, ఒకే ప్రణాళిక ప్రకారం ఒకే పద్ధతిలో పెంచే ఈ వ్యవస్థలో పిల్లల వ్యక్తిగత గుర్తింపు, ప్రత్యేకత, వ్యక్తిత్వం వికాసం ఎలా సాధ్యమవుతుంది. అలాంటి వ్యవస్థలో సాధ్యమైన మేరకు కృత్రిమ ఏకత్వం, సమానత్వాలైతే కనబడతాయి. కాని ఒక ఫ్యాక్టరీ నుండి ఉత్పాదక వస్తువులు ఒకే మూసలో, ఒకే పోలికతో రూపుదిద్దుకొని బయటకు వచ్చినట్లు ఈ వ్యవస్థ నుండి కూడా పిల్లలు ఒకే వ్యక్తిత్వంతో, ఒకే మనస్తత్వంతో బయటికి వస్తారు. కాస్త ఆలోచించండి. మానవుని గురించి ఈ మూర్ఖుల ఆలోచనలు ఎంత అల్పంగా, ఎంత నీచంగా ఉన్నాయో ఊహించండి. బాటా చెప్పుల్లాగా వీరు మానవుల్ని తయారు చేయదలిచారు.



పౌల్ట్రి ఫారంలోని కోడిపిల్లలలాగా, మానవ శిశువులకు దాణా ఇస్తూ మానవుడైనందుకు విద్యాశిక్షణ ఇప్పిస్తారట. అదీ జాతీయ స్థాయిలో ప్రభుత్వ పరంగానట. మానవ శిశువులను వీరు బాటా కంపెనీ బూట్లతో, పౌల్ట్రీ ఫారం కోడి పిల్లలతో సమానమనుకుంటున్నారు.

telgo Septemper.indd 9 8/22/11 3:52 PM

తరతరాలుగా యుగయుగాలుగా ఎందరెందరో ప్రవక్తలు,ఋషులు,మునులు తత్వవేత్తలు పరిచయం చేసి, సమయోచితంగా దాన్ని సంస్కరిస్తూ ప్రయోగపూర్వకంగా సరి అనిపించుకున్న వివాహ వ్యవస్థను, కుటుంబ వ్యవస్థను చిన్నాభిన్నం చేసి, మానవజాతికి ఈ **'మహా సంస్కర్తలు'** అందించబోయే పరిష్కారాన్ని, ప్రతిఫలాన్ని చూడండి. ఇదంతా దేనికోసం? విచ్చలవిడిగా లైంగిక వాంఛల్ని తీర్చుకోవటానికి అడ్డంకి ఉండకూడదనే క్షుద్రకోరికతో ఎంతటి మహోన్నత వ్యవస్థను నేలకూల్చాలని చూస్తున్నారు ఈ కామ పిశాచులు! అయితే ఒక మానవ శిశువును తీర్చిదిద్దటం ఒక సున్నితమైన కళ అనేది వారికి తెలియదు. అది కుటుంబం అనే చిరు కర్మాగారంలోనే, ఆర్ట్ గ్యాలరీలోనే సాధ్యపడుతుంది. ఈ ఆర్ట్‌కు ఎంతో శ్రమ, ఓపిక అవసరం. ఒక కళాకారుడు చిత్రంలోని ఒక్కొక్క రంగుపై ఏ విధంగానైతే ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాడో వ్యక్తిత్వాన్ని రూపొందించటంలో అనేక అంశాలపై, అనేక కోణాలతో పరికించి సంస్కరించ వలసి ఉంటుంది. కూలీ కొచ్చిన కార్మికులు ఈ ప్రత్యేకతను ఈ సున్నిత మనస్తత్వాన్ని ఎలా సంతరించుకోగలరు?

అదీగాక జాతీయ విద్యాసంస్కారాల ఈ వ్యవస్థలో పనిచేయటానికి, సమాజం తరఫున ఈ పిల్లల పోషణా భారాన్ని ఎత్తుకోవటానికి యోగ్యులైన కార్యకర్తలు అవసరమై ఉంటారు. అయితే ఈ పని కోసం తమ ఐహిక కోరికలను నియంత్రించగలిగే, నైతికంగా సంయమనం పాటించే కార్యకర్తలే యోగ్యులవుతారు. వారిలోనే ఈ గుణాలు లేకపోతే వారు పిల్లల్లో ఈ నైతిక నియమాలను, సంయమనాన్ని ఎలా పెంపొందించగలుగుతారు. ఇక్కడో ప్రశ్న జనిస్తుంది. ఇటువంటి కార్యకర్తల్ని మీరెక్కడి నుండి తీసుకువస్తారు? స్త్రీపురుషులను తమ కోరికలు తీర్చుకోవటానికి స్వేచ్ఛగా ఉంచాలనే కదా మీరు జాతీయ విద్యా సంస్కారాల వ్యవస్థను ఏర్పాటు చేయదలిచింది. ఇక సమాజంలో నైతిక సంయమనం, కోరికలపై నియంత్రణకు అవకాశం లేకుండానే చేసేశారే, ఇలాంటి సొసైటీలో మీకు పైగుణాలు కలిగిన కార్యకర్తలు ఎలా లభ్యమవుతారు. ఇష్టానుసారం తమ కోరికల్ని తీర్చుకోవటమే ధ్యేయంగా ఉన్న ఇలాంటి సొసైటీలో సంయమనాన్ని, నిగ్రహాన్ని జీర్ణించుకొని ఆదర్శ ప్రాయంగా నిలిచే నాధుడెవ్వడు?

వ్యభిచారం లేక అక్రమ సంబంధం ద్వారా స్వార్థపరుడైన ఒక వ్యక్తి ఏ స్త్రీనైతే తల్లిగా చేసేస్తాడో, ఆ స్త్రీ జీవితం శాశ్వతంగా నాశనమైపోతుంది. సాంఘికంగా అవమానం, అవహేళన, చీదరింపు, అసూయ ద్వేషాలే కాక అనేకానేక కష్టాల ఊబిలో ఆమె కూరుకు పోతుంది. బ్రతికున్నంతకాలం ఆ ఊబిలో నుండి ఆమె బయటపడజాలదు. ఆధునిక నైతిక సూత్రాల్లో ఈ సమస్యకు కనుగొన్న పరిష్కారమేమిటంటే వివాహం ద్వారా గాని, వివాహేతర సంబంధం ద్వారా గాని, మాతృత్వం దాల్చిన స్త్రీలందరికి సమాన ప్రతిపత్తిని కలుగజేయటం.



మాతృత్వం అనేది గౌరవించదగ్గ స్థానం గనక ఒక బాలిక అమాయకత్వం వల్లనో, అజాగ్రత్త వల్లనో తల్లి అయ్యే బాధ్యతను స్వీకరించింది. కనుక సమాజంలో ఆమెను అవమానపరచటమంటే ఆమెపై దౌర్జన్యం చేయడమేనంటూ వీరు సమర్థిస్తున్నారు.అయితే మొదటి విషయం – ఈ పరిష్కారం వ్యభిచారిణులకు ఎన్ని విధాల అనుకూలమైనప్పటికి, సామూహిక రూపంలో మాత్రం సమాజానికి ఇది కష్టాల్నే తెచ్చి పెడుతుంది. సమాజం సహజంగానే అక్రమ సంతానం కన్న తల్లిని నీచంగానే,ద్వేషంగానే చూస్తుంది. అయితే ఈ నీచ, ద్వేష చూపు, ఈ ప్రవర్తన సమాజంలోని ఇతర వ్యక్తుల్ని ఇలాంటి పాపం నుండి ఆపటానికి,బెదరించటానికి అమోఘంగా పనిచేస్తుంది. వేరొక వైపు ఈ చర్యద్వారా సమాజంలో, సమాజ ప్రజల్లో నైతిక జాగృతి ఉందని నిరూపితమవుతుంది. ఒకవేళ సక్రమ సంతానం కలిగిన మరియు అక్రమ సంతానం కలిగిన ఇద్దరు తల్లులకు ఒకే హోదాను కల్పిస్తే దీని అర్థం ఏమిటి? సమాజం నుండి మంచి చెడు, పుణ్యము పాపము, అక్రమం సక్రమం అనే వ్యత్యాసమే అంతమై పోతుంది. ఒకవేళ ఇది సాధ్యపడిందే అనుకోండి, అయినప్పటికి అక్రమ సంతానం కలిగిన తల్లి కష్టాలు కడతేరుతాయా? ఆమె బాధలన్నీ దూరమై పోతాయా? అక్రమ సంతానం, సక్రమ సంతానం కలిగిన ఇద్దరు తల్లుల్ని మీ దృష్టిలో, మీ సిద్ధాంతంలో సమానమనిపించుకోవచ్చునేమో కాని ప్రకృతి మాత్రం వీరిద్దరిని సమానంగా లెక్కించదు, వీరిద్దరూ ఎన్నటికీ సమానం కాలేరు. బుద్ధిజ్ఞానాల రీత్యా, తర్కం రీత్యా, న్యాయం రీత్యా, యదార్థరీత్యా ఏ విధంగా చూసినా వీరిద్దరు సమానం కాలేరు. లైంగిక కోరికల క్షణిక ఉద్రేకంలో తనను తాను మరిచిపోయి, తననుగాని తనకు పుట్టబోయే పిల్లవానికిగాని సాకటానికి, సంరక్షించటానికి ఎలాంటి భరోసా ఇవ్వని స్వార్థపరుడైన ఒక మగవానికి శరీరం అర్పించుకున్న ఒక మూర్ఖపు స్త్రీ, బాధ్యతాపరుడు, గౌరవనీయుడు అయిన ఒక పురుషుడు లభించేంతవరకు తన కోరికల్ని, ఉద్రేకాల్ని నియంత్రణలో ఉంచుకున్న శీలవతి అయిన స్త్రీతో ఎలా సమానం కాగలదు? ఏ బుద్ధిజ్ఞానాలు వీరిద్దరిని సమానమనగలుగుతాయి? మీరు కోరుకున్నట్లయితే వీరిద్దరిని కృత్రిమంగా, ప్రదర్శనా నిమిత్తం సమానం చేసుకోవచ్చు. అయితే ఒకే భర్తతో జీవితం గడుపుతున్న స్త్రీకి లభించే పోషణ, సంరక్షణల గ్యారంటీని ఆ ప్రేమ వాత్సల్యాలను, అనురాగ పూరితమైన ఆ యోగక్షేమాలను ఆ శాంతిని, ఆ నిశ్చలతను, ఆ నమ్మకాన్ని ప్రేమపూర్వకమైన ఆ అనుబంధాన్ని ఆ మూర్ఖ స్త్రీకి ఎక్కడి నుండి సమకూర్చ గలుగుతారు? ఆమె పిల్లవానికి కేవలం తండ్రి మాత్రమే చూపగలిగే కరుణా వాత్సల్యాలు ఏ బజారు నుండి కొని పెడ్తారు? మహా అయితే చట్ట సహాయంతో ఆమెకు జీవన భృతి ఇప్పించగలరేమో, అయితే ఒక స్త్రీకి ఒక పిల్లవానికి ఈ ప్రపంచంలో కేవలం భృతి మాత్రంతోనే సరి పోతుందా? లేదు. అందుకని అక్రమ సక్రమ మాతృత్వాలను సమానం చేసినంతమాత్రాన పాపంచేసిన స్త్రీలకు బాహ్యంగా ఎంత సౌకర్యం కల్పించినా వారు చేసిన ఈ పొరపాటుకు భౌతిక ఫలితాలను ఈ విధంగా జన్మించిన కారణంగా వారి పిల్లలకు కలిగే వాస్తవ నష్టాలనుండి కాపాడలేరు.



telgo Septemper.indd 10 8/22/11 3:52 PM

పై కారణాలవల్ల సమాజ మనుగడకు, దాని పురోగతికి, లైంగిక సంబంధాల విచ్చలవిడి తనాన్ని కఠినంగా నిరోధించటం సమాజ అత్యవసరాల్లో పరిగణింపబడుతుంది. అంతే కాదు, లైంగిక కోరికల తృప్తికోసం ఒకేఒక ద్వారం అయిన వివాహ సంబంధం తెరిచి ఉంచక తప్పదు. వ్యక్తులకు వ్యభిచరించే స్వాతంత్ర్యమివ్వటం అంటే వారి పట్ల అనవసరమైన పక్షపాతం చూపించటమే కాదు, సమాజ హత్యగా పరిగణించబడుతుంది. ఏ సమాజమైతే దీన్ని స్వల్ప విషయంగా భావిస్తుందో, వ్యభిచారాన్ని కేవలం వ్యక్తిగత ఆనందోల్లాసంలో గడిపే సమయం (హ్యావింగ్ ఎ గుడ్ టైమ్)గా భావించి దృష్టి మరల్చుకుంటుందో, విచ్చలవిడి బీజార్పణ (సోవింగ్ విల్డ్ ఓట్స్) పట్ల సహన వైఖరిని అవలంబిస్తుందో ఆ సమాజం ఒక మూర్ఖ సమాజమే అనబడుతుంది. దానికి తన బాధ్యతల స్పృహ లేదు. తనకు తానే శత్రువుగా వ్యవహరిస్తున్నది. ఆ సమాజానికి తన బాధ్యతల స్పృహే కనుక ఉండి ఉంటే లైంగిక సంబంధాల విషయంలో వ్యక్తిగత స్వేచ్ఛవల్ల సమాజంపై, సమాజ ప్రయోజనాలపై పడే దుష్ప్రభావాల్నే కనుక అది ఎరిగి ఉంటే దొంగతనం, దోపిడి, హత్యలాంటి నేరాల దృష్టితోనే ఈ 'చర్య'ను కూడా చూడగలిగి ఉండాలి.ఇంకా అంతకన్నా తీవ్రమైన నేరంగా పరిగణించాలి. దొంగ, దోపిడీదారు, హంతకుడు ఏం చేస్తారు? మహా అయితే ఒక వ్యక్తి లేక కొందరు వ్యక్తులకు నష్టం కలిగిస్తారు. కాని వ్యభిచారి సర్వ సమాజాన్ని, దాని భావితరాల ను వినాశం వైపుకు నెడ్తాడు.

వ్యక్తుల స్వార్థపరమైన దౌర్జన్యాలను ఎదుర్కోవటానికి, సమాజ ప్రయోజనాలను కాపాడటానికే చట్టం ఉనికిలోకి వచ్చిందని చట్ట బలంతోనే సమాజ ప్రయోజనాలు కాపాడబడుతున్నాయనేది సర్వ వితం. ఈ కారణంగానే దొంగతనాన్ని, హత్యను, దోపిడీని, హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన అనేకానేక విషయాలను చట్టపరంగా నేరాలని గుర్తించి, వాటికి తగిన శిక్షలు విధించి, సమాజాన్ని ఈ రుగ్మతల నుండి కాపాడటానికి ప్రయత్నం జరుగుతుంది. అటువంటప్పుడు 'వ్యభిచారం' విషయంలో చట్టం సొసైటీని ఎందుకు రక్షించకూడదు? సమాజాన్ని ఎందుకు సమర్థించకూడదు? వ్యభిచారాన్ని చట్ట పరమైన నేరంగా ఎందుకు పరిగిణించ కూడదు?

సిద్ధాంతపరంగా కూడా వివాహం, వ్యభిచారం ఈ రెండు ఏకకాలంలో ఒక సమాజంలోని అంతర్ భాగాలు కాలేవు. ఒక వ్యక్తికి



బాధ్యతలు స్వీకరించకుండానే లైంగిక వాంఛలు తీర్చుకునే స్వాతంత్రమిచ్చి అదే పనికోసం వివాహ నియమాన్ని ఏర్పాటు చేయటం అర్థం లేని విషయం. ఉదాహరణకు రైలులో టికెట్టు లేకుండా ప్రయాణించటాన్ని సమర్థిస్తూనే, ప్రయాణం కోసం టికెట్టు కొనుక్కునే నియమాన్ని ఏర్పాటు చేయటం ఎలా ఉంటుంది? బుద్ధిజ్ఞానాలున్న ఏవ్యక్తి కూడా ఏకకాలంలో ఈ రెండు పద్ధతుల ఉనికిని సమర్థించలేడు. సమంజసమైన, సముచితమైన పద్ధతి ఏమిటంటే టికెట్టు కొనాలనే నియమాన్నైనా తొలగించండి లేదా టికెట్టు కొనాలని నియమం విధిస్తే, టికెట్టు లేకుండా ప్రయాణించటాన్ని నేరంగా పరిగణించండి. ఈ విధంగానే వివాహం, వ్యభిచారాల విషయంలో ఈ ద్వంద్వ వైఖరి అసమంజసమైనదే కాదు. అహేతుకమైనది కూడాను. సమాజం కోసం వివాహ నియమం అనివార్యమని ఏ కారణాలతో దృఢీకరించబడిందో, వాటితోనే వ్యభిచారాన్ని (అది ఏ రూపంలోనున్నా సరే) నేరంగా పరిగణించక తప్పదు.

సమాజంలో ఒక అపోహను వ్యాపింప జేశారు. అదేమిటంటే వివాహానికి ముందు ఒక యువకునికి లైంగికవాంఛల తృప్తికోసం కొద్దోగొప్పా అవకాశం ఉండాలి. ఎందుకంటే యవ్వనంలో లైంగిక ఉద్రేకాన్ని ఆపటం కష్టమైన పని, అలా ఆపితే ఆరోగ్యంపై చెడు ప్రభావం పడుతుంది – కాని ఈ దృక్పథం ఏ విషయాల మీదైతే ఆధారపడి ఉందో, అవన్నీ కల్పితమైనవి, కృత్రిమమైనవి, కామోద్రేకాల్ని లేపే తీవ్రమైన, అసామాన్యమైన (అబ్‌నార్మల్) ఈ పరిస్థితి సామాన్య(నార్మల్) ప్రజల్లో ఎందుకు జనిస్తుందో తెలుసా? సమాజంలోని చెడు సంస్కృతి ఈ ఆలోచనలకు, భావాలకు బలవంతంగా, ఉద్దేశపూర్వకంగా తీవ్రమైన ఉద్రేకాలకు గురిచేస్తుంది. మన సమాజంలో ప్రబలిపోయిన సినిమాలు, సాహిత్యం, నగ్న చిత్రాలు, సంగీతం, మిశ్రమ సమాజాల్లో అత్యధికంగా అలంకరించుకున్న స్త్రీలు మగవారికి తారసపడటం-వంటి కారణాలే సామాన్య ప్రజల్ని లైంగికపరంగా అసామాన్యమైన, తీవ్రమైన పరిస్థితికి గురిచేస్తాయి. అంతే కాని ప్రశాంతమైన వాతావరణంలో సామాన్య స్త్రీపురుషుల్లో తమనుతాము ఆపుకోలేనంత లైంగిక ఉద్రేకాలు పొడసూపవు. కొద్దోగొప్పో ఇలాంటి ఉద్రేకాలు పొడసూపినా, మానసిక, నైతిక శిక్షణ ద్వారా వాటిని కట్టడి చేయవచ్చు. యవ్వన దశలో లైంగిక కోరికలు తీర్చుకోకపోతే ఆరోగ్యంపై చెడు ప్రభావం పడుతుందనే భావన కేవలం మోస పూరితమైనది, భ్రమింపజేసేది తప్ప ఇంకేమి కాదు. అందుకని నైతికత, ఆరోగ్యం రెండిటినీ కాపాడుకోవాలంటే సమాజంలోని ఈ చెడు సంస్కృతిని, ధనిక జీవితపు చెడు ప్రమాణాలను మార్చక తప్పదు. వీటివల్లనే నేడు వివాహం కష్టతరమై వ్యభిచారం సులభమై పోయింది.

అజ్ఞాన సమాజంలోని స్పష్టంగా కనిపించే మరో ప్రత్యేకత ఏమిటంటే ఏ రుగ్మతల ప్రభావాలైతే పరిమితంగా, స్వల్పకాలంగా, పైకి కనపడేవిగా ఉంటాయో వాటిని వెంటనే గుర్తించగలం. కాని ఏ రుగ్మతల ప్రభావాలు బహుముఖంగా, సుదీర్ఘకాలంగా, పైకి కన్పించనిగా ఉంటాయో వాటిని సకాలంలో గుర్తించి నిర్మూలించలేము. ఎందుకంటే వాటి ప్రభావాలు చాలాకాలం గడిచిన తర్వాత గాని బయల్పడవు. అందువల్ల వాటిని గురించి పట్టించుకోవటం జరగదు. పట్టించుకోక పోవటమే కాదు, వాటిని ఉపేక్షించటం, క్షమించటం, చివరికి అనుగ్రహించటం కూడా జరుగుతుంది. దొంగతనం, దోపిడి, హత్యలాంటి నేరాలను ప్రముఖంగాను, వ్యభిచారం లాంటి నేరాన్ని అల్పంగా చూడటానికి కారణం ఇదే. ఒక వ్యక్తి తన ఇంట్లో ప్లేగు వ్యాధి వ్యాపింపజేసే ఎలుకల్ని జమచేసి అంటురోగాల్ని వ్యాపింపజేస్తే మూర్ఖ సమాజం అతన్ని క్షమించరాని నేరస్థునిగా పరిగణిస్తుంది. ఎందుకంటే అతని చర్య స్పష్టంగా, ఎంతో హానికరమైనదిగా కన్పిస్తుంది. అయితే ఇదే ఒక వ్యభిచారి తన స్వార్థంకోసం, సమాజ జీవిత నాడీ కోసేసినా, దాని నష్టాలు ఎంత భయంకరంగా ఉన్నప్పటికీ, అవి పైకి కనపడనివిగా ఉంటాయి కనుక ఈ అజ్ఞానులకు ఆ వ్యభిచారి అన్నివిధాల క్షమార్హునిగా కనబడతాడు. అంతేకాదు అతను ఒక నేరానికి పాల్పడ్డాడనే అనుమానం కూడా వారికి రాదు. అజ్ఞానం, మూఢత్వాలకు బదులు విజ్ఞతావివేచనాలు, ప్రకృతి నియమాలు మన సమాజ సంస్కృతికి పునాదులు కాగలిగితే ఇలా వ్యవహరించటానికి ఆస్కారమే ఉండదు.

telgo Septemper.indd 11 8/22/11 3:52 PM

సయ్యద్ అబ్దుస్సలాం ఉఫీ
abdussalamsyed@ymail.com



మహా గొప్ప మానసిక శాస్త్రవేత్త ముహమ్మద్ (స)

వ్యక్తుల పరువుప్రతిష్టలు, సమాజంలో వారికున్న గౌరవోన్నతలను బట్టి వారితో వ్యవహరించాలి. ప్రతి వ్యక్తికీ సముచితమైన స్థానం ఇవ్వాలి. ఒక గౌరవనీయుణ్ణి అతని స్థాయికంటే దిగజార్చడం, ఒక నీచుణ్ణి పదవి పీఠాలపై ఎక్కించడం అనేది అనేక రకమైన అపసవ్యతలకు, అపశృతులకు, అనర్థాలకు దారి తీస్తుంది. ఈ కారణంగానే దైవ ప్రవక్త (స) వ్యక్తులతో సంభాషించడంలోగానీ, వ్యాపార లావాదేవీలు చేసేటప్పుడుగాని ఎదుటి వ్యక్తి స్థాయి, స్థోమతను, మనోభావాన్ని, ఆత్మాభిమానాన్ని దృష్టిలో పెట్టుకుని మరి ప్రవర్తించేవారు. తన చుట్టూ ఉన్న అనుచర గణంలో ప్రతి ఒక్కరిలోని బలగాలు, బలహీనతల మీద ఆయన దృష్టి ఉండేది. ప్రతి వ్యవహారంలోనూ ఎదుటి వ్యక్తి మనోభావాన్ని పరిగణలోకి తీసుకుని మరి మసలుకునేవారు. ఓ సందర్భంలో స్వయంగా ఆయన (స) ఇలా సెలవిచ్చారు: **"ప్రజలతో వారి స్థాయిని బట్టి వ్యవహరించండి".** (అబూ దావూద్)

ఆయన (స) తాను తీర్పు ఇవ్వగోరే వ్యక్తుల పట్ల మరింత జాగ్రత్తగా వ్యవహరించేవారు మహనీయ ముహమ్మద్ (స). వారికి ఏదైనా బోధించాలనుకున్నప్పుడు వారి ఆర్థిక, బాహ్య, ఆధ్యాత్మిక, నైతిక, విద్యాపరమైన ప్రకర్షను దృష్టిలో పెట్టుకుని మరీ హితోపదేశం చేసేవారు. ఓ వ్యక్తి వచ్చి **'సత్క్రియల్లో మహోత్కృష్టమైనదేది?'** అని ప్రశ్నించగా – **"ధర్మ పోరాటం (జిహాద్)"** అని బదులిచ్చారు. అదే ప్రశ్న మరో వ్యక్తి వచ్చి అడిగినప్పుడు–**"నమాజు"** అని సెలవిచ్చారు. ఇంకో వ్యక్తి వచ్చి అడిగినప్పుడు–**"ఉత్తమ నడవడిక"** అన్నారు. పైకి పరస్పరం విరుద్ధంగా కనబడుతున్న ఈ సమాధానాలు నిశిత దృష్టితో గనక ఆలోచిస్తే అలాంటి వైరుధ్యం వీటిలో లేదని తెలుస్తుంది. ఒక వ్యక్తి అయిదు పూటల ప్రార్థనలు, రమజాను ఉపవాసాలు, జకాత్, హజ్ మొదలగు విధులను చక్కగా నిర్వర్తిస్తున్నాడు. కానీ **'ధర్మపోరాటం–జిహాద్'** అంటే అతనికి ఒక విధమైనటువంటి ఇబ్బంది. కనుక అతన్ని **'జిహాద్'** మహా కార్యం అన్నారు. మరో వ్యక్తి సత్కర్మలన్నీ బాగానే చేస్తున్నాడు. కాని నమాజు పట్ల అలసత్వం, నిర్లక్ష్య ధోరణి కలిగి ఉన్నాడు గనక **'నమాజ్'** ఉత్కృష్ట కార్యం అన్నారు. ఇంకో వ్యక్తి దైవానికి సంబంధించిన విషయాల్లో బాగున్నాడు; కాని దాసుల విషయంలో, వారి హక్కుల విషయంలో మహా దారుణంగా వ్యవహరిస్తున్నాడు కాబట్టి **'ఉత్తమ నడవడిక'** అని హితవు పలికారు. అవును–, వివేకికి, అవివేకికి మధ్య గల తేడా ఒక్కటే. వివేకి ప్రజలకు ఏం కావాలో తెలుసుకుని మరి చెబుతాడు. అవివేకి తనకు కావలసింది మాత్రమే ప్రజలకు చెబుతాడు.

ఒక వ్యక్తి దైవ ప్రవక్త (స) వారి పవిత్ర సన్నిధికి వచ్చి–"నేను (ధర్మం కోసం) ప్రస్థానం (హిజ్రత్) చేస్తాననీ, జిహాద్ (ధర్మయుద్ధం)లో పాల్గొంటానని మీతో ప్రమాణం చేసి చెబుతున్నాను. ప్రతిగా అల్లాహ్ తరఫు నుండి ప్రతిఫలాన్ని ఆశిస్తున్నాను" అన్నాడు. అది విని మహనీయ ముహమ్మద్ (స) ఆ వ్యక్తితో–**"నీ తల్లిదండ్రులలో ఏ ఒక్కరైనా బ్రతికి ఉన్నారా?"** అనడిగారు. 'అవును, ఇద్దరూ బ్రతికే ఉన్నారు' అని సమాధానమిచ్చాడా వ్యక్తి. **"మరైతే నిజంగా నువ్వు, అల్లాహ్ నీకు మంచి ప్రతిఫలాన్ని ఇవ్వాలని అభిలషిస్తున్నావా?"** అని మళ్ళీ ప్రశ్నించారు ప్రవక్త మహనీయులు (స). 'అవును' అన్నాడతను.

అప్పుడాయన **"అలాగైతే నువ్వు నీ తల్లిదండ్రుల దగ్గరికి తిరిగి వెళ్లిపో. వారిద్దరినీ బాగా చూసుకో"** అని చెప్పి పంపించారు. మరో హదీసులో **"నువ్వు నీ తల్లిదండ్రుల సేవలోనే పరిశ్రమిస్తూ ఉండు. అదే నీపాలిట జిహాద్"** అని ఉంటే, ఇంకో ఉల్లేఖనంలో **"నువ్వెలాగైతే వారిని ఏడిపించి వచ్చావో, వెళ్ళి అలానే వారిని నవ్వించు"** అని ఉంది.

(బుఖారీ, ముస్లిం)

అంటే, వచ్చిన ఆ వ్యక్తికి ఇతర ధర్మ కార్యాల పట్ల శ్రద్ధ ఉండేది కాని, తల్లిదండ్రుల ఎడల శ్రద్ధ ఉండేది కాదు. ఈ కారణంగానే **"నీ జిహాద్ నీ తల్లిదండ్రుల సేవ"** అని సెలవిచ్చి పంపారు ప్రవక్త మహనీయులు (స). సుబ్హానల్లాహ్!

మరో అద్భుత సంఘటన గురించి తెలుసుకుందాం రండి! ఓ వ్యక్తి దైవ ప్రవక్త (స) వారి పవిత్ర సన్నిధికి వచ్చి–'యా రాసూలల్లాహ్! నాలో లేని అవలక్షణమంటూ ఏది లేదు. జూదం, చోరీ, వ్యభిచారం, అబద్ధ మాడటం–అన్నీ ఉన్నాయి. (సకల అవలక్షణాల పుట్టననుకోండి). అయితే వీటన్నింటిని ఒకేసారి ఉన్నపళంగా మానుకోవాలంటే నా వల్ల కాని పని. తమరు మన్నిస్తారంటే ఏదో ఒక అవలక్షణాన్ని వదులుకోవడానికి సిద్ధంగా ఉన్నాను' అని చెప్పుకొచ్చాడు. అతను చెప్పిందంతా శ్రద్ధగా విన్న ప్రవక్త మహనీయ (స) **"సరే–నీవు ఎప్పటికీ అబద్ధమాడ నని ప్రమాణం చేస్తావా?"** అనడిగారు. అందుకావ్యక్తి– '(ఓస్ ఇంతేనా, అదెంత పని) యా రసూలల్లాహ్! ఈ క్షణం నుంచి జీవితంలో ఎన్నడూ అసత్యం పలుకనని మనస్ఫూర్తిగా ఒట్టేసి చెబుతున్నాన'న్నాడు. తర్వాత ఆ వ్యక్తి తనలో తాను ఉబ్బితబ్బిబ్బవుతూ –ఆహా! ఎంత భాగ్యం!! దైవ ప్రవక్త (స) ఎంత తేలికైన విషయాన్ని వదలమన్నారు' అనుకుంటూ అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

రాత్రయింది–దొంగతనం చేయాలన్న ఆలోచన ఒకసారి వస్తే, మద్యం సేవించాలన్న ఆలోచన మరోసారి, మగువ ఒడిలో సేద తీరాలన్న ఆలోచన ఇంకోసారి, జూదం, మట్కా ఆడాలన్న ఆలోచన ఒకసారి అతన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి. అయితే చెడు ఆలోచన వచ్చిన ప్రతిసారి ప్రవక్త మహనీయులు (స) వారితో చేసుకున్న ఒడంబడిక అతనికి గుర్తొచ్చేది. అదే క్షణంలో ఆ నేరం తాలూకు శిక్ష కూడా అతని మనోతెరపై కదలాడేది. ఒకవేళ అబద్ధం చెబుదాములే అనుకున్నా ప్రవక్త మహనీయుల (స) వారి సన్నిధిలో అది సాధ్యపడదు. అలా ఆ వ్యక్తి ఒక్కో వ్యసనాన్ని, పాపాన్ని పరిత్యజిస్తూ ఉదయం అయ్యేకల్లా పరమ

telgo Septemper.indd 12 8/22/11 3:53 PM

పునీతుడై పోయాడు. (ఒక్క రాత్రి వీటన్నింటికి దూరంగా ఉండగలిగిన నేను ఇకమీదట అన్ని రాత్రులు కూడా వీటన్నింటికీ దూరంగా జీవించగలనన్న ఆత్మ విస్వాసం అతనికి ఏర్పడింది.) కొన్ని రోజుల తర్వాత దైవ ప్రవక్త (స) వారి సన్నిధికి వచ్చిన అతని యోగక్షేమాల్ని అడిగారు ప్రవక్త మహనీయులు (స). సమాధానంగా అతను–'యా రసూలల్లాహ్! **'అబద్ధం ఆడను'** అన్న చిన్న మాట నాలోని అవలక్షణాలన్నింటిని తొలగించేసింది' అని సంబర పడిపొతూ చెప్పాడు.

చుట్టూ ఉన్న ఒనరుల పట్ల నాయకుడైన ప్రతి ఒక్కడికి అవగాహన ఉండాలి. ఒనరులు అంటే–,గనుల్లో దొరికే బొగ్గో, వజ్రమో, అడవిలో దొరికే కలపో, శ్రీచందనమో లేదా ధనం మాత్రమే కాదు. మన స్థాయి, మన పరివారం సామర్థ్యాలు, మన చుట్టూ ఉండే వ్యక్తుల టాలెంట్ ఇవన్నీ మానవ గనికి సంబంధించిన ఒనరులే. ఒకవేళ నాయకుడు తన సహచర బృందం యొక్క స్థాయి, సామర్థ్యాలను సరిగ్గా అంచనా వేయకపోతే, వారిలోని ప్రతిభాపాటవాలను, పాండిత ప్రకర్షను గుర్తించకపోతే వారి శక్తి స్థోమతల్ని పసిగట్టిన ఇతరులు వారిని ఎగ రేసుకుపోతారు.

అలాగే వారిలో గల బలహీనతలను సయితం గుర్తెరిగి వాటిని బలగాలుగా తీర్చిదిద్దాలి. ఒక్కో వ్యక్తి ఒక్కో పని ఇష్టంతో చేస్తాడు, మరో పని పట్ల అశ్రద్ధ కనబర్చవచ్చు. అలాంటప్పుడు అతనిలో ఆ పని పట్ల శ్రద్ధను పెంచాలి. ఆ పనిని ఎంతో చాక చక్యంగా తను చేయగలడని ధైర్యమివ్వాలి. ఒక పనికి ఒక వ్యక్తిని నియమించినప్పుడు అతన్ను నమ్మాలి. అనుమానం ఉన్న వ్యక్తిని నియమించకూడదు. నియమిస్తే అనుమానించకూడదు. తన సహచర బృందాన్ని తన అక్కున చేర్చుకోవడం సమర్థ నాయకుడి లక్షణం. వారిలోని ప్రతిభాపాటవాలను పిండేసి, వారి శ్రమ శక్తిని గుంజేసి, ఎంతగా వాడుకోవాలో అంతగానూ వాడేసి తరువాత వదిలేయడం అసమర్థ నాయకుడి లక్షణం. సహచరులొచ్చి సలహా అడిగినప్పుడు సమర్థుడి అభిప్రాయం వినడానికి సర్వసాధారణంగానే అన్పిస్తుంది. కానీ అది ఎలాంటి చిక్కు లేకుండా సమస్యను సులువులగా పరిష్కరించి ఫలితాన్ని అనుభవించేలా చేస్తుంది. ఇదే విషయాన్ని మనం పై ఉదాహరణలలో చూడగలం.

శాంతి ప్రియ

దైవ తీర్పు

వాస్తవాన్ని వక్రీకరించి
అసత్యాన్ని ప్రచారంలో ముంచి
తౌహీద్ తత్వాన్ని కత్తిరించి
షిర్క్ సడిని ఆపాదించి
మోడులా మిడిసి పడే
ముష్రిక్కు గుండె శిశిరానికి
'అస్ఫలుస్సాఫిలీన్' దైవ తీర్పు
చర్మ చక్షువులకు వెర్రి ఆకర్షణల రంగులు అద్ది
ఆత్మ చక్షువులకు కర్రి మబ్బుల గంతలు కట్టి
జన జీవనాన్ని పాప పంకిలంలో నెట్టి
జన ప్రవంతిలో నాస్తకత్వాన్ని ప్రవేశ పెట్టి
పండిత పామరుల్ని తప్పు త్రోవ పట్టించే
దగుల్బాజీ నిశీథ పిపాసులకు
'నిప్పు కత్తెరలు' దైవ తీర్పు

పంచేంద్రియాలను మిథ్యావాదంతో వంచించి
జ్ఞానేంద్రియాలను చీకటి చెరసాల్లో బంధించి
మౌఢ్యాన్ని నరనరాల్లో దట్టించి
పెల్లుబుకే పాప భీతిని, పరలోక ప్రీతిని
నీరు గార్చే నీతి హీనులకు
'సలసల మరిగే చీము' దైవ తీర్పు
నిజమంటే జడుసుకుని
సత్యమంటే తోక ముడుచుకుని
మిథ్యా నీలి పొగలను
పట్టుకు వ్రేలాడే పూర్ణ అవిశ్వాసులకు
'నిప్పు భక్షణం' దైవ తీర్పు
షిర్క్ నుండి తౌహీదుకి
చీకటి నుండి ప్రభావానికి
నిరాశ నుండి ఆశాసౌధానికి
అశ్రు జలధి నుండి ఆనంద తీరానికి
నరకం నుండి ఫిర్‌దౌస్ శిఖరానికి
నడిపించే మార్పు
దివ్యావిష్కృతి తీర్పు

ఎవరీ ప్రవక్తలు?

దేవుడు మనిషిని ప్రవరుండ్ణి, స్వేచ్ఛాపరుణ్ణి చేశాడు
మనిషి బానిసత్వంలో బ్రతకడాన్ని ఇష్టపడ్డాడు
అలా–
మార్గం మరచిన మానవాళికి మార్గనిర్దేశకులు ప్రవక్తలు
మనిషికి స్వేచ్ఛను ఇప్పించిన చైతన్యవంతలు ప్రవక్తలు
ప్రవక్తల పవిత్ర జీవితాల్లో ఎన్నో వీర సంఘటనలు
నేటి చరిత్రకు తెలియని ఎన్నో మహా త్యాగాలు

ఏ దేశమైనా ఏ శతాబ్దమైనా గర్వించదగిన
సత్యం బోధించిన శాంతి సేనాధిపతులు ప్రవక్తలు
తల్లి చెప్పని వాస్తవాలు తండ్రి చెప్పిని ఎన్నో నిజాలు
సంప్రదింపులతో ఛేదించలేని ఎన్నో సృష్టి నిగూఢాలు
నిండిన జీవిత రహస్య పేటికను మనిషి ముందు తెరిచారు
చిరాకు పరిచే ఎన్నో సమస్యలను పరిష్కరించారు

విశ్రాంతినిచ్చే ఎన్నో నిశిరాత్రి స్తుతి గీతాలు
పగలు విసుగును తొలగించే ఎన్నో ఆరాధనలు
చెట్లకు చైత్రము వలె, నదులకు శ్రావణం వలె
మనిషికి గుణము జ్ఞానముండాలి అన్నారు.

ఎన్నో గీతలు, ఎన్నో ఒంపులు, ఎన్నో రంగుల కలయికలు
కళానైపుణ్యానికి పరాకాష్ట సాయం సమయపు హరివిల్లు
దిగంతాల పటము మీద ఎంతో
విచిత్రమైన చిత్రము ఇంద్రధనస్సు అంటూ
అద్భుత చిత్రకారుని కళాదక్షతను చాటి
అర్పించండి మీ మనస్సు మాధవుడికి అన్నారు ప్రవక్తలు



telgo Septemper.indd 13 8/22/11 3:53 PM



ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

ముస్లిం జీవితానికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన ప్రశ్నలు



ప్రశ్న: అల్లాహ్ పేర్లను, గుణాలను తెలుసు కోవటం వల్ల కలిగే ప్రయోజనం ఏమిటి?

జ: అల్లాహ్‌కు సంబంధించి ప్రజల ప్రథమ కర్తవ్యం ఆయన గురించి తెలుసుకోవటం. తాము ఆరాధించే దైవాన్ని గురించి క్షుణ్ణంగా తెలుసుకున్నప్పుడే వారు సిసలైన ఆరాధన చేయగలుగుతారు. ఆరాధనలోని మాధుర్యాన్ని ఆస్వాదించగలుగుతారు. అందుకే సృష్టికర్త ఇలా ఆదేశించాడు: **"కనుక ఓ ప్రవక్తా! అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడని నువ్వు బాగా తెలుసుకో".**(ముహమ్మద్-19)

అందుకే దైవ కారుణ్య వైశాల్యాన్ని మననం చేసుకోవాలి, దేవునిపై ఆశలు పెట్టుకోవాలి, ఆయన శిక్షలోని తీవ్రతను విడమరచి చెప్పాలి -తద్వారా ఆయన పట్ల భక్తి, భయము జనిస్తాయి. అలాగే సత్కరించే, సన్మానించే విషయంలో అల్లాహ్‌ను ఒకే ఒక్కడిగా ఒప్పుకోవాలి-తత్కారణంగా ఆయన యెడల కృతజ్ఞతా భావం పెంపొందుతుంది. అల్లాహ్ నామాలు, ఆయన గుణగణాల ద్వారా ఆయన్ని సేవించటంలోని భావార్థం ఏమిటంటే వాటి యదార్థ జ్ఞానాన్ని ఆర్జించాలి. వాటి అర్థాన్ని గ్రహించాలి. తదనుగుణంగా ఆచరించాలి. అల్లాహ్‌కు చెందిన కొన్ని నామాలు, కొన్ని గుణాలు దాసుల్లో గనక వస్తే ప్రశంసనీయమే. ఉదాహరణకు- జ్ఞానం, దయ, జాలి, కరుణ, న్యాయం మొదలగునవి. దేవుని మరి కొన్ని పేర్లు లక్షణాలున్నాయి. అవి గనక దాసుల్లో అభివ్యక్తమవుతే అవి అవాంఛనీయం, నిందార్హమవుతాయి. ఉదాహరణకు:-గర్వం, అహంకారం, బడాయి, బలాత్కారం, ప్రచండత మొదలగునవి. అలాగే దాసుల్లో ఉండాల్సిన గుణాలు దాసుల్లో ఉంటేనే అందం, ఆనందకరం కూడా. ఆ గుణాలు దైవానికి మాత్రం సరిపడవు, శోభించవు. ఉదాహరణకు- దాస్య భావం, నిస్సహాయత, అక్కర అభ్యర్థన, పరాభవం పరాధీనత ఇత్యాదివి. అల్లాహ్ ఇలా ఉపదేశించాడు: **"అల్లాహ్‌కు మంచి మంచి పేర్లున్నాయి. కాబట్టి మీరు ఆ పేర్లతోనే ఆయన్ని పిలవండి".** (అల్ ఆరాఫ్- 180)

ప్రవక్త మహనీయుల (స) ప్రవచనం ద్వారా కూడా ఈ విషయం రూఢీ అవుతోంది. ఆయన(స) ఇలా అన్నారు:

"నిశ్చయంగా అల్లాహ్‌కు 99 పేర్లున్నాయి. అంటే నూటికి ఒకటి తక్కువ. వీటిని గణించిన వాడు స్వర్గంలో ప్రవేశిస్తాడు."

(బుఖారీ,ముస్లిం)

ఈ హదీసులో వచ్చిన **'ఇహ్సా'** అనే పదానికి అర్థం లెక్కించటం. అయితే దాసుడు ఆ పేర్లకు తగినట్లుగా ఆచరించాలి. దాసుడు దైవాన్ని **'అల్ హకీమ్'** అన్నాడంటే అతను తన వ్యవహారాలన్నింటినీ అల్లాహ్‌కు అప్పగించాలి. ఎందుకంటే దాసుని పనులన్నీ యుక్తినీ, విజ్ఞతా వివేచనలను వాంఛిస్తున్నాయి. **'ఖుద్దూస్'** అని నోటితో అన్నప్పుడు అల్లాహ్ అన్ని రకాల లోపాలకు అతీతుడు, పవిత్రుడు అన్న విషయం మదిలో తళుక్కున మెరవాలి. అల్లాహ్ యొక్క ఈ రకమైన పేర్ల పట్ల భక్తీ ప్రపత్తులు కలిగి ఉండాలి. వాటి ఆధారంగా అల్లాహ్‌ను వేడుకోవాలి.

ప్రశ్న: అల్లాహ్ పేర్లలోనూ, గుణాలలోనూ ఉన్న తేడా ఏమిటి?

జ: అల్లాహ్ పేర్ల ఆధారంగా గుణగణాల ఆధారంగా శరణు వేడటం కూడా ధర్మసమ్మతమే. వాటి ఆధారంగా ప్రమాణం చేయటం కూడా సమ్మతమే. ఈ రెండు విషయాలలోనూ అల్లాహ్ పేర్లు, గుణగణాలు సంయుక్తమే. అయితే రెండింటిలో కొన్ని వ్యత్యాసాలు కూడా ఉన్నాయి. గమనార్హమైన విషయాలు కొన్నింటిని చూడండి:- (1) పేరు పెట్టేటప్పుడు **'దాస్య భావం'** వచ్చేలా జాగ్రత్త పడాలి. మొరపెట్టుకునేటప్పుడు అల్లాహ్ పేర్లతో మొరపెట్టుకోవాలి-ఇది మాత్రం సమ్మతమే. కాని గుణగణాలను ఆశ్రయించకూడదు. ఉదాహరణకు:- **అబ్దుల్‌కరీమ్** (ఉదాత్తుని దాసుడు) అనే పేరు పెట్టడం సరైనదే. కాని **అబ్దుల్ కరం**(ఉదారం యొక్క దాసుడు) అని నామకరణం చేయటం మాత్రం సరైనది కాదు. అలాగే దుఆ చేసే సమయంలో **'యా కరీమ్'** అని సంబోధించటం సరైనదే కాని **'యా కరమల్లాహ్'** అని చెప్పడం సరైనది కాదు.

(2) అల్లాహ్ పేర్లతో గుణగణాలు జోడించబడవచ్చు గాని గుణగణాలతో పాటు పేర్లు వచ్చి చేరవు. ఉదాహరణకు- అల్లాహ్ పేర్లలో ఒకటి అర్రహ్మాన్ (కరుణామయుడు) ఈ పేరుతో రహ్మత్(కారుణ్యం) అనే గుణం వచ్చి చేరుతుంది.

(3) అల్లాహ్ చేసే పనులతో ఆయన పేర్లు వచ్చి చేరవు. ఉదాహరణకు:- అల్లాహ్ పనులలో ఒకటి కోపగించుకోవటం. అయితే ఈ క్రియ ఆధారంగా ఆయన 'కోపిష్టి' అని అనటం సమంజసం కాదు.

ప్రశ్న: దైవదూతలను విశ్వసించటం అంటే భావం ఏమిటి?

జ: దైవ దూతలను విశ్వసించటమంటే భావం దైవదూతల ఉనికిని అంగీకరించటం, వారు అల్లాహ్‌చే సృష్టించబడిన జీవరాసులనీ, అల్లాహ్ తన ఆరాధన నిమిత్తం, తన కార్యక్రమాలను అమలు పరిచే నిమిత్తం వారిని పుట్టించాడని గట్టిగా నమ్మటం. ఉదాహరణకు - ఈ సూక్తులను గమనించండి:

"వారంతా గౌరవించబడిన దాసులు, ఏ విషయంలోనూ వారు ఆయనకంటే ముందు మాట్లాడరు. పైగా ఆయన ఆజ్ఞను ఖచ్చితంగా పాటిస్తారు." (అల్ అంబియా - 26,27)

దైవ దూతలను విశ్వసించటంలో నాలుగు విషయాలు చేరి ఉన్నాయి:

(1) దైవదూతలనేవారు ఉన్నారు అనే విషయాన్ని నమ్మటం.(2)వారిలో ఎవరి పేరన్నా తెలిసివుంటే ఆ పేరు తదితర వివరాలతో నమ్మాలి. ఉదాహరణకు- హాజ్రత్ జిబ్రయీల్. (3) ఆ దైవదూతను గురించి మనకు తెలిసిన విధంగా నమ్మాలి. ఆయన శరీరం చాలా పెద్దది అనేది వాటిలో ఒకటి. (4) ఆ దైవదూతలు చేసే ప్రత్యేక పనులను గురించి మనకు తెలిసి ఉన్నప్పుడు, అవి నిజమని నమ్మాలి. ఉదాహరణకు- మృత్యు దూత చేసే పని.

telgo Septemper.indd 14 8/22/11 3:53 PM

ప్రాణం ఖరీదు రూపాయి!



ఆయన రూపాయే అడుగుతాడు! పది మంది దగ్గర పది... వెయ్యి మంది దగ్గర వెయ్యి.... లక్ష మంది దగ్గర లక్ష...ఇలా సేకరిస్తున్నాడు. ఆ డబ్బుని ఆయన 'సొంతాని'కే వాడుకుంటున్నాడు.
గుండెకు చికిత్స...కనీసం రెండు మూడు లక్షల ఖర్చు. కిడ్నీ మార్పిడి ....దీనికి ఖర్చు లక్షల్లోలో ఇదీ అదీ అనికాదు... ఏ చిన్న అనారోగ్యం తో ఆసుపత్రి గడప తొక్కినా వేలకు వేలు ఖర్చు. వాటిని భరించే శక్తి అందరికీ ఉండదు. మరి, అలాంటి వారి పరిస్థితి...? కొన్ని స్వచ్ఛంద సంస్థలూ కొందరు ధనవంతులూ తమవంతుగా కొంత మందికి సాయం చేస్తున్నారు. సాయం చెయ్యాలంటే డబ్బులు ఉండాలి. కానీ, సాయం చెయ్యాలనుకునే వ్యక్తికి డబ్బులుండాల్సిన పని లేదు! మన సుంటే చాలు, మార్గమే ఆ మనిషిని వెతుక్కుంటూ వస్తుంది. అలాంటి మనిషే...షేఖ్ ఖాజా మొహియుద్దీన్.

ఆ రోజు నుంచి...

మొహియుద్దీన్‌ది కోయంబత్తూర్‌లోని గాంధీపురం. చదువు నాలుగో తరగతి. వృత్తి...చెప్పుల దుకాణానికి యజమాని. ఇతనికో తమ్ముడు న్నాడు. పేరు ముజీబుర్‌రహ్మాన్...1990లో బైక్ ప్రమాదంలో రహ్మాన్‌కి బాగా దెబ్బలు తగిలాయి. తమ్ముణ్ణి ఒక ప్రవేటు హాస్పిటల్లో చేర్చాడు. తలపై బలంగా గాయం తగలడంతో ఆరు నెలలపాటు కోమాలోకి వెళ్ళి పోయాడు రహ్మాన్. ఈ ఆరు నెలలూ అతణ్ణి ఆసుపత్రిలోనే ఉంచారు. ఒక ప్రవేటు ఆసుపత్రిలో అన్ని రోజులపాటు చికిత్స అంటే ఖర్చులు ఏ స్థాయిలో ఉంటాయో అందరికీ తెలిసిందే. బంధువుల దగ్గర, స్నేహితుల దగ్గర తెలిసిన వాళ్ళందరి దగ్గరా అప్పులు చేశాడు మొహియుద్దీన్. ఆర్నెల్ల తర్వాత ఆరోగ్యంగా తమ్ముడు ఇంటికి వచ్చే శాడు. ఈ ఆసుపత్రి అనుభవం మొహియుద్దీన్‌లో ఎన్నో ఆలోచనలు రేపింది. 'మధ్య తరగతి కుటుంబాల్లో ఎవరికైనా అనారోగ్యమంటే ఆర్థికంగా ఎంతో భారం. చేసిన అప్పులు తీర్చుకోవడానికే జీవిత కాలం పడుతుంది. **'నాలాంటి పరిస్థితి నా చుట్టూ ఉన్నవాళ్ళకి రాకూడదు. ఒకవేళ వస్తే వాళ్ళకు నేను సాయపడతాను'** అని నిర్ణయించు కున్నాడు. తన తమ్ముడి ఆసుపత్రి ఖర్చులకే అప్పులు చేశాడు. ఎవరికైనా ఎలా సాయ పడతాడు...?

రూపాయి చాలు

మనసుంటే మార్గం ఉందన్న నానుడిని నిజం చేస్తూ పేద రోగులకూ దాతలకూ మధ్య వారధిగా మారాడు మొహియుద్దీన్. దాతల వివరాలు ముందుగా సేకరించేవాడు. వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేద రోగుల పరిస్థిత తెలుసుకుని ఆ దాతలకు వివరించేవాడు. వాళ్లి చ్చిన సొమ్ముని రోగులకు అందజేసేవాడు. నాలుగేళ్ల క్రిందట కేరళకి చెందిన ఓ చిన్నారి గుండె చికిత్స చేయించుకునేందుకు నగరానికి వచ్చింది. కానీ, ఆమె తల్లిదండ్రులు పేదవారు. వాళ్ల దగ్గర ఆసుపత్రి ఖర్చులకు సరిపడేంత సొమ్ము లేదు.

ఆ విషయం తెలుసుకుని స్థానిక రోటరీ క్లబ్ ద్వారా విరాళం ఇప్పిం చాడు మొహియుద్దీన్. రానురానూ మొహియుద్దీన్ ఆశ్రయించేవారు ఎక్కువైపోయారు. దాంతో మూడేళ్ల కిందట **'ఒరు రుబాయి ఒరు ఉయర్'** (ఒక రూపాయితో ఒక ప్రాణం) అనే కొత్త కార్యక్రమానికి రూపకల్పన చేశాడు. ఎవరైనా ఒక పేద రోగి తనను ఆశ్రయిస్తే...ఆ వ్యక్తి వివరాలూ అతనికొచ్చిన వ్యాధీ, చేయించాల్సిన చికిత్సా అందు కయ్యే ఖర్చు..ఈ వివరాలన్నీ కొన్ని కరపత్రాలపై ముద్రించేవారు. కోయంబత్తూరు పరిసర ప్రాంతాల్లో అన్నీ విద్యాసంస్థలకూ వాటిని పంపేవారు. విద్యార్థులను తలా ఒక రూపాయి సాయం చేయమని ఆ కరపత్రాల్లో రాసి ఉంటుంది. అలా సేకరించిన సొమ్మును ఆసుపత్రి పేరుతో డిమాండ్ డ్రాఫ్ట్ తీసి రోగుల ఖర్చులకు వినియోగిస్తున్నారు. ఈ **'ఒక్క రూపాయి సాయం'** అనే ఆలోచన చాలా మందికి నచ్చింది. దాంతో మొహియుద్దీన్ బంధువులూ కొంత మంది స్నేహితులు కూడా అతనితోపాటు సేవాకార్యక్రమాల్లో పాలుపంచుకోవడం మొదలు పెట్టారు.

తిరుప్పూర్ జిల్లాకి చెందిన ఓ పసిపాప గుండెకు రంధ్రంతో జన్మిం చింది. ఆమె తల్లి మొహియుద్దీన్ సాయం కోరాడు. **'ఒక రూపాయి ఒక ప్రాణం'** కార్యక్రమంలో భాగంగా ఆ చిన్నారికికి గత ఏడాది జూన్‌లో చికిత్స చేయించారు. అదే ప్రాంతానికి చెందిన మరో పేద విద్యార్థికి మూత్రపిండాల సమస్య. ఒక రూపాయి మరో ప్రాణాన్ని కాపాడింది. ఇలా ఇప్పటి వరకూ ఈ కార్యక్రమం ద్వారా 900 మంది కి ఆర్థిక సహాయాం అందించారు మొహియుద్దీన్.

'నా చెప్పుల దుకాణం నా కుటుంబ పోషణకు సరిపోతోంది. అయితే, నా చుట్టూ ఉన్నవాళ్లూ నా కుటుంబమే. మరి, వారికి ఏదైనా అనా రోగ్యముంటే డబ్బులు ఎక్కడ్నుంచి తేవాలి? అందుకే ఒక రూపాయి పథకం మొదలుపెట్టాను. మనం ఇచ్చే ఒక రూపాయితో ఒకరి ప్రాణం నిలబడుతుందంటే ఇంకేం కావాలి అనుకునే వారు ఎంతో మంది స్పందిస్తున్నారు. నాకు సాయం చేస్తున్నారు' అంటాడు మొహియుద్దీన్. ఇతడి చదువు నాలుగో తరగతే అయినా తెలుగు, తమిళం, మల యాళం, కన్నడ, హిందీ, ఉర్దూ భాషలు మాట్లాడతాడు. కాబట్టి ఏ ప్రాంతం వారు తనను ఆశ్రయించినా ఆదుకుంటున్నాడు.

'నా' అనుకోవడం తప్పు లేదు.

అయితే, ఈ **'నా'** పరిధిలోకి ఎంత మంది వస్తున్నారు అని ఆలో చించుకోవడమే గొప్ప. **'నా చుట్టూ ఉన్నవాళ్లందరూ నావారే'** అన్నంత గా తన మనస్సు పరిధిని విస్తరించుకున్న మొహియుదీన్‌కి హ్యాట్సాఫ్.

– ఎ.కుమరేశన్, న్యూస్‌టుడే, కోయంబత్తూర్.
(ఈనాడు 10-07-2011 సౌజన్యంతో)

telgo Septemper.indd 15 8/22/11 3:53 PM

షేఖ్ హబీబుర్రహ్మాన్ జామయీ

పూల పరిమళం

బల్బం పట్టి పూ ఒడిలో అ ఆ ఇ ఈ... నేర్చుకుందాం!

అంతరంగం అందంగా ఉంటే ఆచరణ అర్థవంతంగా వుంటుంది.

ఆందోళన మనిషి అనారోగ్యాన్ని బలహీనతని పెంచు తుంది.

ఇ తరులకు మేలు చేయటమంటే తనకు తాను ఉపకారం చేసు కోవటమే.

ఈ లోకంలో విశ్వాసం ఘనమైన ధనం. ధర్మాన్ని అనుసరించి జీవించటం సౌఖ్యం. సర్వరుచులలో సత్యం అమిత రుచికరం. ప్రజ్ఞతో కూడిన జీవితం ఉత్తమం.

ఉ త్తమ గుణాలు దైవానికి దగ్గరగా చేస్తే, దుర్గుణాలు దైవానికి దూరంగా చేస్తాయి.

ఊ హకూ, బ్రతుక్కూ మధ్యన వంతెన ఉండాలి.

ఋ ంత చదివినా, ఎంత నేర్చుకున్నా దాన్ని ఆచరణలో పెట్టకపోతే ఫలితం ఉండదు. ఆహారాన్ని నమిలినా మింగకుండా వుంటే ఎలా వ్యర్థమవుతుందో ఆచరణ లేని జ్ఞానమూ అంతే.

ఎ రంగున ముంచబడిన వస్త్రం ఆ రంగును పొందినట్లుగా సత్పురుషుడు, దుష్టుడు, తపస్వి, దొంగ-వీరిలో ఎవరి సాహ చర్యంలో గడిపితే, వారి గుణాలే మనిషికి అబ్బుతాయి.

ఐ శ్వర్యానికి ఆభరణం మంచితనం. విద్యకు అలంకారం నీతి. ధనానికి అలంకారం దానం. అన్ని గుణాలకీ అలంకారం మంచి శీలం.


ఒ ంటికి అందం చక్కటి దుస్తులు. మనసుకు అందం ఆనంద ప్రదమైన ఆలోచన. దైవభీతి ఆభరణం.

ఓ మర్రిగింజ మహావృక్ష మైనట్టే, చిత్తశుద్ధితో చేసే చిన్న సత్కార్యం మహాఫలితానిస్తుంది.

ఔ దార్యం ఉన్న హృదయం అమూల్య హృదయంగా పరిణతి చెందుతుంది.

ధనంతో కొనలేనివి

ధనంతో పుస్తకాలు కొనవచ్చు, జ్ఞానం కాదు.
ధనంతో మందుమాకు కొనవచ్చు ఆరోగ్యం కాదు.
ధనంతో అందమైన వస్తువులు కొనవచ్చు అందం కాదు.
ధనంతో అద్దం కొనవచ్చు చూపు కాదు.
ధనంతో అద్దాల మేడ కొనవచ్చు ఆత్మ శాంతి కాదు.
ధనంతో మనిషిని కొనవచ్చు మనసుని కాదు.
ధనంతో ధనాన్ని కొనవచ్చు అభిమానధనాన్ని కాదు.
ధనంతో దేన్నయినా కొనవచ్చు ధర్మాన్ని కాదు.



మనిషి - మృగం

జంతువులకు కోరిక ఉంటుంది తెలివి(అఖల్) ఉండదు.
దైవదూతకు తెలివి ఉంటుంది. కోరికలుండవు.
మానవులకు తెలివి, కోరిక రెండూ ఉంటాయి.
మనిషి తెలివి ద్వారా కోరికల్ని అదుపు చేసుకుంటే దైవదూతల్లో చేరి పోతాడు.
కోరికల కర్రిమబ్బు తెలివిపై క్రమ్ముకుంటే జంతువులలో చేరిపోతాడు.

ఒకటింకొకటిని హరించివేస్తుంది



లంచం న్యాయాన్ని హరించివేస్తుంది.
నింద(గీబత్)కర్మలను హరించివేస్తుంది.
కోపం బుద్ధి,వివేకాన్ని హరించివేస్తుంది.
ఆలోచన వయసుని హరించివేస్తుంది.
పశ్చాత్తాపం పాపాన్ని హరించివేస్తుంది.
ఉపకారము చెడుని హరించివేస్తుంది.
అబద్ధము జీవనోపాధిని హరించివేస్తుంది.
అసూయ పుణ్యకార్యాన్ని హరించివేస్తుంది.
ధనాశ మానవత్వాన్ని హరించివేస్తుంది.

మహితుల మహితోక్తులు

పరదూషణ, అంగలార్పు నుండి తన నాలుకని కాపాడుకోండి శాంతి కలుగుతుంది. **– అబూబకర్ (ర)**

దౌర్జన్యుణ్ణి క్షమించటం అంటే బాధితునిపై దౌర్జన్యం అవుతుంది. **– ఉమర్‌బిన్ ఖత్తాబ్(ర)**

పశ్చాత్తాపం కన్నా పాపాన్ని వదలటమే సులభం. **– ఉస్మాన్ (ర)**

ఆత్మ సంతృప్తి సకల సంపదలకన్నా శ్రేయస్కరం. **– (అలీ (ర)**

మంచి అంటే చెడునుంచి దూరముండటమే. **– ఆయిషా (ర)**

అజ్ఞాని కోసం మౌనం కంటే గొప్పది మరేదీ లేదు. **– షేక్ సాదీ**

జ్ఞాని మృదువుస్వభావుడై ఉండాలి. **– ఇమామ్ గజాలి (ర)**

గుణపాఠం కోసం చావు చాలు. **– ఉమర్ ఫారూఖ్ (ర)**

telgo Septemper.indd 16 8/22/11 3:53 PM



పుస్తకాలపేట

ముహమ్మద్ సలీమ్ జామయీ



ముచ్చటగా మూడు

మూడింటిని కాపాడుకోవాలి: ధర్మం - పరువు - దేశం

మూడు తక్కువగా ఉన్నా ఎక్కువే: రోగం - శత్రుత్వం - అగ్ని కణం

మూడింటిలో జ్ఞానం దాగుంది: ప్రశ్న - ప్రస్తకం - అనుభవం

మూడింటిని అదుపులో ఉంచుకోవాలి: నాలుక - మనసు - అవయవాలు

మూడింటిలో జీవితం విలువ దాగుంది:
సత్సాంగత్యాలు - సజ్జన సంతానం - ప్రయోజనకరమైన జ్ఞానం

మూడు నిత్యం అవసరం: గాలి - నీరు - ఆహారం

ముగ్గురు వ్యక్తులకు అపరిచిత పాత్రంలో సయితం భయం ఉండదు:
ధీర శాలి అయి యోధుడు - స్థిత ప్రజ్ఞుడైన పండితుడు - నేరు మంచివాడైన వ్యక్తి

మూడు రకాల ప్రజలు: ఆహారం లాంటివారు, వీరి అవసరం ఎప్పుడూ ఉంటుంది - మందుమాకు వంటి వారు. వీరి అవసరం అప్పుడప్పుడు ఉంటుంది. - రోగంలాంటి వారు. వీరి అవసరం ఎవరికీ ఎప్పుడూ ఉండకూడదు.

కొన్ని శబ్దాలకు గల అరబీ పేర్లు

నషీష్: అన్నము ఉడికేటప్పుడు వచ్చే కుతకుత శబ్దం నషీష్.

రనీన్: బాణం విసిరినప్పుడు ధనస్సు నుండి వచ్చే శబ్దం.

ఖదీఫ్: భయంకర స్వరాన్ని, సముద్ర అలల హోరును ఖదీఫ్ అంటారు.

ఖాఖఆహ్: ఆయుధము, ఎండినపోయిన చర్మము లేదా కాగితము నుండి వచ్చే శబ్దం.

గర్‌గరహ్: మనిషికి మరణం సమీపించినప్పుడు ప్రాణం పోతూ పోతూ ఉండగా వచ్చే శబ్దం.

అజీజ్: ఉరుము, మెరుపు శబ్దాన్ని మరియు స్త్రీ శబ్దాన్ని అజీజ్ అంటారు.

ఖష్‌ఖష: కొత్త దుస్తులు లేదా కాగితం నుండి వచ్చే శబ్దం.

ఖాలిద్ మరియు చిట్టి చిలుక

ఖాలిద్ మంచి బాలుడు. అతనికి పక్షులంటే చాలా ఇష్టం. ఒక రోజు అతను ఓ తోటలోంచి వెళుతుండగా ఒక చిట్టి చిలుక క్రింద పడి ఉండటం చూశాడు. దానికి ఇంకా రెక్కలు సరిగ్గా పెరగని కారణంగా అది ఎగరలేకపోతోంది. దాని తల్లి చెట్టు కొమ్మల మీద కంగారుగా అరుస్తూ అటూ ఇటూ తిరుగితోంది. అది గమనించిన ఖాలిద్ మనసు లో ఈ అపాయానికిగానూ ఒక ఉపాయం తోచింది. అతను ఆ చిట్టి చిలుకను చేతిలో తీసుకొని నెమ్మదిగా చెట్టెక్కి చిలుక గూటిలో దానిని వదిలాడు.

ఖాలిద్ చెట్టు దిగిన తర్వాత తల్లి చిలుక కృతజ్ఞతగా ఖాలిద్‌ని చూస్తూ, తన చిట్టి పాపాయితో సంతోషంగా గూటిలో కూర్చుంది. ఖాలిద్ కూడా సంతోషంగా ఇంటికి వెళ్ళి తన ఆనందాన్ని నాన్నతో షేర్ చేసుకున్నాడు. సాంతం విన్న నాన్న **'శభాష్ ఖాలిద్!'** అంటూ భుజం తట్టి అతని నుదుటిని ముద్దాడి అతన్ని మెచ్చుకున్నాడు. అల్లాహ్ నీకు, నీవు చేసిన మంచి పనిగానూ మహా గొప్ప ప్రతిఫలం ప్రసాదించాలని దీవించాడు. చూశారా! పిలల్లలూ! మనము కూడా జంతువులతో, పక్షులతో ఇలానే మంచిగా వ్యవహరించాలి.

చూసి నేర్చుకో!

ఆకాశాన్ని చూసి అంతటి ఎత్తుకు ఎలా ఎదగాలో నేర్చుకో
పుడమి వైపు దృష్టి సారించి దాతృగుణాన్ని నేర్చుకో
పర్వతాన్ని చూసి స్థిరత్వాన్ని, నిలకడను నేర్చుకో.
ఖర్జూరపు చెట్టును చూసి సహిష్ణుతను నేర్చుకో
ఒంటెను చూసి సహనం నేర్చుకో.
సాగరాన్ని చూసి కావ్యం నేర్చుకో.
పూలను చూసి అందంగా ఎలా జీవించాలో నేర్చుకో.



మీకు తెలుసా?

తన నోటి పైభాగాన్ని కదిలించగలిగే ఏకైక జంతువు మొసలి.

దాల్ఫిన్ నిదురపోయేటప్పుడు ఒక కన్ను మాత్రమే మూసుకుంటుంది.

ప్రపంచంలో అన్నింటికంటే ఎత్తైన పర్వత శిఖరం ఎవరెస్ట్ శిఖరం. దాని ఎత్తు అక్షరాల 8848 మీటర్లు.

తాబేలుకు పల్లుండవు.

telgo Septemper.indd 17 8/22/11 3:53 PM

సర్వేంద్రియానం నయనం ప్రధానం

3

ఇక్కడ స్పష్టంగా తెలిసేది ఏమిటంటే, మన మెదడులో జరగవలసిన అవసరమైన పనులు నిరంతరం ఆగకుండా జరుగకపోతే, మనం ఏ ఎన్విరాన్‌మెంట్‌లో నివసిస్తున్నామో, ఆ ఎన్విరాన్‌మెంట్‌లోని మనచుట్టూ ఉన్నవాటినీ, మనకు ప్రియమైన వారిని గుర్తుపట్టలేం! పైన చెప్పిన ముసలాయన మాటలు మరొక సారి మనకు ఓ వాస్తవం యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తున్నాయి.

"ముఖాన్ని గుర్తించడం ఎంత ముఖ్యమో, దానిని పోగొట్టుకునే వరకూ నేను ఎన్నడూ అర్థం చేసుకోలేకపోయాను."

ప్రతీ రోజూ మరలా మరలా మనం ఉపయోగించుకోవడానికి వీలుగా మన మెదడు కొన్నింటిని రికార్డ్ చేసుకుని భద్ర పరచుకుంటుంది. కాని ఈ దృశ్యాలు ఎక్కడ రికార్డ్ చేయ బడతాయి? ఎలా రికార్డ్ చేయబడతాయి? ఏ విధంగా మరియు ఎవరిచే అవి రీకవర్ చేయబడతాయి? ఉదాహరణకు కంప్యూటర్‌లో సమాచారాన్ని హార్డ్ డిస్క్‌లోగాని, సీడీలలోగాని, డివిడీలలోగాని స్టోర్ చేస్తారు. అయితే వాటియొక్క కెపాసిటీ చాలా తక్కువ. కంప్యూటర్ గురించి తెలియని వారికి చాలా స్పష్టంగా అర్థం కావడానికి ఓ ఉదాహరణ ఇక్కడ అందిస్తున్నాము.

ఒక వ్యక్తి తన గత 20 సంవత్సరాల నుండి చేస్తున్న ప్రతీ పనిని ఓ వీడియోలో రికార్డ్ చేయించుకుంటున్నాడు అనుకుందాం. అంటే 20×365 రోజులు = 7,300 రోజులు. రోజుకి 24 గంటలు కాబట్టి ఒక రోజును పూర్తిగా మంచి క్వాలిటీలో రికార్డ్ చేయడానికి 6 డివిడీలు అవసరం అనుకుందాం. మరి 7,300 రోజులను పూర్తిగా రికార్డ్ చేయడానికి 7,300×6 = 43,800 డివిడీలు కావాలి. పోనీ 40,000 డివిడీలు అవసరం అనుకుందాం. ఈ 40 వేల డివిడీలలో ఆ వ్యక్తి యొక్క గడచిన 20 సంవత్సరాల జీవిత విషయాలున్నాయన్న మాట.

ఆ వ్యక్తి ఓ పది సంవత్సరాల క్రితం అంటే 2001 సంవత్సరం ఆగస్టు 2వ తారీఖున జరిగిన ఓ ముఖ్య సంఘటనను గుర్తు చేసుకున్నాడు. ఆ సంఘటన గురించి అతనికి ఆలోచన వచ్చిన మరుక్షణమే అతని మెదడులో అప్పటి ఆ సంఘటన కదలాడింది. మరలా ఆ సంఘటన తన కళ్ళ ముందు జరుగుతున్నట్లుగా తెలుస్తుంది. ఒక సెకను కంటే అతి తక్కువ కాలంలో ఇది జరిగింది. మరి ఇదే సంఘటనను ఆ 40వేల డివిడీలలో వెతకడానికి మీకు ఎంత సమయం పడుతుంది? ఆ 40వేల డివిడీలను ఉంచడా నికి ఎంత స్థలం కావాలి? కాని ఇన్ని వేల డివిడీలలో పట్టే సమాచారమంతా, మెదడులోని ఓ అతి చిన్న ప్రదేశంలో నిక్షిప్తమయి ఉందంటే, అది ఎంత అద్భుతం!

"మరి ఆయన (అల్లాహ్) మీరు అడిగిన (అవసరమైన) దానినల్లా మీకు ఇచ్చి ఉన్నాడు. మీరు అల్లాహ్ చేసిన మేళ్లను-అనుగ్రహాలను లెక్కించదలచినా లెక్కించ లేరు". (ఇబ్రాహీమ్: 34)

అల్లాహ్ అనుగ్రహాలు అగణ్యమైనవి. వాటి ని ఎవరయినా ఎంచదలిస్తే లెక్కించ లేరు. ఆయన చేసిన మేళ్లకు కృతజ్ఞతలు తెలుపుకోదలిస్తే అది మన వల్ల కాదు కూడా. ఒక **'అసర్'** ఉల్లేఖనంలో హజ్రత్ దావూద్ (అ) గారి మాట ఇలా ఉంది:'ఓ అల్లాహ్! కృతజ్ఞత తెలుపుకోవడం అనేది కూడా నీ తరఫున ప్రసాదించబడిన ఒక వరమే అయినప్పుడు, ఏ రీతిన నేను నీకు కృతజ్ఞతలు తెలుపుకోను స్వామీ!?' అన్నారు. దానికి సమాధానంగా అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

"దావూద్! ఇప్పుడు నువ్వు కృతజ్ఞతలు చెల్లించావు. ఎందుకంటే నాకు కృతజ్ఞతలు చెల్లించ గలిగే శక్తి లేదని నువ్వు అంగీకరించావు. అదే నీలోని కృతజ్ఞతాభావానికి ప్రతీక".

(తఫ్సీర్ ఇబ్నె కసీర్)

మన కనులకుండే లెన్స్‌ల ద్వారా మనం చూస్తున్న ప్రతీ విషయం రికార్డ్ అవుతుందన్న విషయం మనలో చాలామందికి తెలియదు. ఒకొక్కసారి మనం ఏదో ఆలోచనలో ఉన్నప్పుడు మన ముందు జరగుచున్న విషయం (లేదా) మన కనులు చూడగలిగేంత దూరంలో జరగుచున్న విషయాలను మనం గమనించం.కాని ఎవరైనా హిప్నాటిస్ట్, మనల్ని హిప్నటైజ్ చేసి, ఫలానా రోజు మీరు నడుస్తూ వెళుతున్నప్పుడు, మీ ముందు వెళుతున్న కారు నంబర్ చెప్పండి అని అడిగినప్పుడు, చెప్పగలుగుతాము.ఇది ఎలా సాధ్యం? ఇది సాధ్యమైంది అంటే మనం పట్టించుకోని చాలా విషయాలు కూడా మన మెదడులో రికార్డ్ అవుతున్నాయని తెలుస్తుంది.

పైన చెప్పుకున్నట్లు, ప్రస్తుతం అందుబాటులోనున్న టెక్నాలజీ ద్వారా 20 సంవత్సరాల జీవితాన్ని రికార్డ్ చేయడానికి 40వేల డివిడిలు కావాలి. సైన్స్ లేదా ఇంజనీరింగ్ చదివే విద్యార్థులు, పై విషయాలు చదివి డివిడీల కంటే ఎక్కువ సమాచారాన్ని రికార్డ్ చేసుకునే



పరికరాలు కూడా ఉన్నాయని చెప్పవచ్చు. కాని పెద్దగా చదువుకోలేని వారికి కూడా ఈ వ్యాసం అర్థం కావాలనే ఉద్దేశ్యంతో ఇక్కడ డివిడీల గురించి చెప్పడం జరిగింది. డివిడీలు మాత్రమే కాకుండా ఏ మెమోరీ డివైస్‌ను మీరు తీసుకున్నా సరే, ఈ వ్యాసంలో చెప్పబడిన విషయాలకు సరిపోతుంది.


కళ్ళతో చూసే ఈ చూపుకు సంబంధించిన ఇంద్రియ జ్ఞానం మరియు అందులో దోషం లేని ఆ వ్యవస్థలు, అల్లాహ్ యొక్క అంతు లేని శక్తిని మనకు తెలియజేస్తున్నాయి.

"కనుక మీరు మీ ప్రభువు యొక్క ఏ ఏ అనుగ్రహాలను కాదనగలరు?"
(అర్రహ్మాన్: 13)

సృష్టికర్త అయిన అల్లాహ్ మానవ శరీర లోతులలో, కంటికి కనిపించని చిన్న ప్రదేశాలలో కూడా అద్భుతాలను ఉంచాడు. అవి మానవుడు అర్థం చేసుకోవడానికి అతీతంగా ఉన్నాయి.

కళ్ళతో చూసే ఈ చూపుకు సంబంధించిన ఇంద్రియ జ్ఞానం మరియు అందులో దోషం లేని ఆ వ్యవస్థలు, అల్లాహ్ యొక్క అంతు లేని శక్తిని మనకు తెలియజేస్తున్నాయి. ప్రతీ క్షణం, మనం గ్రహించే ప్రతీ దృశ్యం, అల్లాహ్ ఇష్ట ప్రకారమే జరుగుతుంది. ఆ కారణం చేతే, ప్రతీ క్షణం మనం చూసేది మన కోసం విడిగా ఓ పరిక్షే! ఈ వాస్తవం ఖుర్‌ఆన్‌లో తెలియజేయబడింది.

"నిశ్చయంగా, మేము మానవుణ్ణి ఒక మిశ్రమ బిందువుతో సృష్టించాము. అతనిని పరీక్షించటానికి, మేము అతనిని వినేవాడిగా, చూసేవాడిగా చేశాము." (దివ్యఖుర్‌ఆన్ 76:2)



telgo Septemper.indd 18 8/22/11 3:53 PM



రెండు కళ్ళు - ఒకటే చూపు

మనం రెండు కళ్ళతో పుట్టామని తెలుసు కాని, ఒకే చూపుకు రెండు కళ్ళు ఎందుకు అని మనం ఎప్పుడైనా ఆలోచించామా? వాస్తవానికి ప్రతీ కన్ను దానికంటూ విడిగా ఓ దృష్యాన్ని ఏర్పరచుకుంటుంది. ప్రతీ కన్ను విడివిడిగా దృశ్యాలను ఏర్పరచుకుంటే, మరి రెండు కళ్ళు ఎందుకు? ఒకటి చాలు కదా! అని అనిపిస్తుంది. రెండు కళ్ళ మధ్య దూరం సుమారుగా 5 సెంటమీటర్లు ఉంటుంది. అలాగే బాహ్య ప్రపంచంతో ఒకొక్క కన్ను ఒకొక్క దృక్కోణాన్ని కలిగియుంటుంది.

2-డైమన్షన్‌లో ఒకొక్క కన్నుకు అందిన దృశ్యాన్ని మెదడు స్వీకరించి, ఈ రెండు కళ్ళ నుండి రెండు 2-డైమన్షన్ దృశ్యాలని కలిపి త్రీ డైమన్షన్ (త్రీడీ)లో దృశ్యాన్ని సృష్టిస్తుంది. ఆ విధంగా రెండు కళ్ళ నుండి అందిన దృశ్యాల మధ్య ఉండే తేడాలను గమనించి, ఆ దృశ్యాలు ఎంత దూరంలో ఉన్నాయి, ఏ డెప్త్‌లో ఉన్నాయనేది మెదడు నిర్ధారిస్తుంది. ఒకవేళ రెండు కళ్ళ నుండి అందిన రెండు దృశ్యాలను సరిగ్గా గనుక మెదడు కలపలేకపోతే, మనకు ఒకే దృశ్యం రెండుగా కనిపిస్తుంది. అంతేకాకుండా అది టూ డైమన్షన్‌లోనే ఉంటుంది.

ఈ విషయం అర్థం కావడానికి ఓ ఉదాహరణ: ఏదైనా చెట్టు కొమ్మలను రెండు కళ్ళతో చూడండి. కాస్సేపటి తరువాత ఒక కన్నును మూసుకుని, రెండవ కన్నుతో మీ దృష్టిని ఆ కొమ్మలపై సారించండి. ఒక నిమిషం తరువాత మీ కన్ను తెరవండి. ఆ కొమ్మలు ఇంతకు ముందు కంటే ఇప్పుడు మరింత దూరంగా ఉన్నట్లు తెలుస్తుంది.

రెండు విడివిడి దృశ్యాలు కలిసి ఒకే త్రీడీ దృశ్యంగా కనిపించాలంటే, ఎంత ఖచ్చితంగా మెదడు లెక్క గట్టాలో ఆలోచించండి. ఇది అర్థం కావాలంటే మరొక సింపుల్ ఉదాహరణ చెప్పాలి. మీరు కలర్ వాల్ పోస్టర్లను చాలాసార్లు చూసే ఉంటారు. ఒకొక్క సారి వాల్‌పోస్టర్‌పై ఒకే బొమ్మ, రెండింటిగా కొంచెం తేడాతో వేరే రంగులో కనిపిస్తుంది. బ్లర్‌గా కనిపిస్తుంది. సాధారణంగా పోస్టర్ ప్రింట్ చేసేటప్పుడు, 4 రంగులతో 4 ప్లేట్లు ఉపయోగించి ప్రింట్ చేస్తారు. అందులో ఏ ఒక్క ప్లేట్ కొంచెం ప్రక్కకి జరిగినా చాలు, ప్రింట్ అయిన బొమ్మ కదలిపోయినట్లు కనిపిస్తుంది. అందుకోసం ప్రెస్‌లో చాలా శ్రద్ధ తీసుకుని, జాగ్రత్తగా ప్లేట్ల స్థానాలను సరి చేస్తారు.మరి మన మెదడు ఎంత శ్రద్ధ తీసుకుంటుందో ఇప్పుడు మీకర్థమై ఉంటుంది. ఒక సెకనులో ఎన్నో దృశ్యాలను కళ్ళు మెదడుకు పంపుతూ ఉంటాయి. ఈ ఫ్రేమ్‌లన్నింటిని జాగ్రత్తగా, అతి తక్కువ సమయంలో కలిపి మనకు నిరంతరంగా మన ముందరి ప్రపంచం కనిపిస్తూ ఉండేలా చేస్తుంది మన మెదడు. ఒక నిమిషంలో మెదడు చేసే కాల్‌క్యులేషన్స్‌ని మనం కాల్‌క్యులేటర్ ఉపయోగించి చేస్తే, ఎన్ని గంటలు పడుతుందో తెలిస్తే ఆశ్చర్యమేయక మానదు. ఇలాంటి లోపం లేని వ్యవస్థను సృష్టించింది మరెవరో కాదు, సర్వమూ తెలిసిన సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌యే. అల్లాహ్ సృష్టిలో లోపం లేకపోవడాన్ని క్రింది ఖుర్‌ఆన్ వాక్యం ద్వారా తెలుసుకోవచ్చు.

"ఆయనే ఒకదానిపై ఒకటి ఏడు ఆకాశాలను సృష్టించాడు. ఆ అనంత కరుణామయుని సృష్టిలో నీవు ఎలాంటి లోపాన్ని చూడలేవు. కావాలంటే మరొకసారి చూడు! ఏమీ? నీకేమైనా లోపం కనిపిస్తుందా?" (ఖుర్‌ఆన్- 67:3)

(....5 పేజీ మిగతా భాగం)

3) చివరి మనందరి గమ్యస్థానం ఏది?

"ఓ మానవుడా! నువ్వు నీ ప్రభువును చేరుకునే వరకూ ఈ సాధనలో (ఈ కఠోర పరిశ్రమలో) నిమగ్నుడవై ఉండి, తుదకు ఆయన్ను చేరుకుంటావు". (ఇన్షికాఖ్: 6)

"సృష్టి (ప్రక్రియ)ని మొదలెట్టేవాడు అల్లాహ్‌యే. మరి ఆయనే దాన్ని పునరావృతం చేస్తాడు. మరి మీరంతా ఆయన వైపున కే మరలించ బడతారు". (రూమ్:11)

"మరి మీరంతా మరలిపోవలసింది మీ ప్రభువు వైపునకే. మీరు చేస్తూ ఉన్న కర్మలను ఆయన మీకు తెలియపరుస్తాడు. ఆయన అంతర్యాల్లోని విషయాల్ని సయితం ఎరిగినవాడు". (జుమర్: 7)

"కడకు అందరూ పోయి చేరవలసింది నీ ప్రభువు వద్దకే! మరి ఆయనే నవ్విస్తున్నాడు, ఆయనే ఏడ్పిస్తున్నాడు. మరి ప్రాణం తీసేవాడు ఆయనే, ప్రాణం పోసేవాడూ ఆయనే. ఇంకా ఆయనే జంటలను- ఆడ- మగలను సృజించాడు". (అన నజ్మ్: 42-45)

"నిశ్చయంగా (అందరూ) మరలిపోవలసింది నీ ప్రభువు సన్నిధికే". (అలఖ్: 8)

ఇంత చేసిన దేవుడు మనిషి ఎలా జీవించాలో చెప్పలేదా? అంటారా. చూడండి: "మేము అతని (మానవుని)కి మార్గం కూడా చూపాము. ఇక అతను కృతజ్ఞుడుగా వ్యవహరించినా లేక కృతఘ్నుడుగా తయారైనా (వాడి ఇష్టానికే వదిలేశాము). అయితే, అవిశ్వాసుల కోసం మేము సంకెళ్ళు, ఇనుప పట్టాలను, జ్వలించే అగ్నిని సిద్ధం చేసి ఉంచాము. (తథ్యిన్నంగా) నిశ్చయంగా సజ్జనులు (విశ్వాసులు) 'కాఫూర్' కలుపబడిన మధుపాత్రను సేవిస్తారు. అదొక సరోవరం. దైవ దాసులు దాన్నుండి (తనివి తీరా) త్రాగుతారు. (తాము కోరిన చోటికి) దాని పాయలు తీసుకుపోతారు". (అల్ ఇన్సాన్: 3-6)

అభిమాన సోదరులారా! అల్లాహ్ మనల్ని అందమైన ఆకృతిలో పుట్టించి, శక్తియుక్తులు అనుగ్రహించి మన మానాన మనల్ని ఇట్టే వదలి పెట్టలేదు. మానవ జీవిత లక్ష్యాన్ని ఎరుకపర్చడమేకాక, ఆ లక్ష్య సాధనకు పని కొచ్చే మనందరి ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం కోసం గొప్ప ఏర్పాటు కూడా చేశాడు. తన ప్రవక్తల ద్వారా, తన గ్రంథాల ద్వారా సన్మార్గమేదో, దుర్మార్గమేదో చక్కగా వివరించాడు. ఆ పరంపరలో వచ్చిన చిట్ట చివరి గ్రంథం పవిత్ర ఖుర్‌ఆన్ అయితే కట్ట కడపటి దైవ ప్రవక్త ముహమ్మద్ (స). ఇక మనం దైవ విధేయతా మార్గాన్ని అవలంబించి ధన్యజీవులుగా నెగ్గుకొస్తామో లేక అపమార్గాల్ని అనుసరించి అల్లాహ్ మనకు చేసిన అనేక మేళ్లను మరచి బ్రతికి ఇహపర జీవితాల్ని మరింత దుర్భరం చేసుకుంటామో మన ఇష్టాయిష్టాల మీదే ఆధారపడి ఉంటుంది. ఈ విషయాన్నే దైవ అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా బోధ పర్చారు: **"ప్రతి వ్యక్తీ తన అంతరాత్మను క్రయ విక్రయాలకై పెడతాడు. ఈ వర్తకంలో అతడు దాన్ని చంపినా చంపేస్తాడు. లేదా దానికి స్వేచ్ఛనయినా ప్రసాదిస్తాడు".** (సహీహ్ బుకారీ)

అంటే మనం మన దుష్కర్మల ద్వారా మన అంతరాత్మ గొంతు నులిమివేయటమో లేక దాని గౌరవాన్ని కాపాడటమో చేస్తాం అన్న మాట. మనం ఒకవేళ దురాగతాలకు పాల్పడితే మన అంతరాత్మను చంపుకున్నట్లే. ఒకవేళ మనం సత్కార్యాలు చేస్తే మన అంతరాత్మకు శాంతిని, ముక్తిని, మోక్షాన్ని ప్రసాదించిన వాళ్ళమవుతాము. ఓ వర్గం స్వర్గానికి! మరో వర్గం నరకానికి!! ఎటు వెళ్ళాలో మనమే నిర్ణయించుకోవాలి సుమా!!!

telgo Septemper.indd 19 8/22/11 3:54 PM

రమజాన్ వీడ్కోలు

మౌలానా అబ్దుల్ ఖాదిర్ ఉమ్రీ



అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహి వ బరకాతుహు

ప్రియ మిత్రుల్లారా! నేను (రమజాను మాసం) మీ క్షేమాన్ని, శ్రేయాన్ని, ప్రగతిని, ఇహపరలోకాల సాఫల్యాన్ని కోరి, మీ వ్యక్తిగత, సామాజిక శీల నిర్మాణం కోసం విశ్వ ప్రభువైన అల్లాహ్ తరఫు నుండి వచ్చాను. నెల సాంతం మీతో ఉన్నాను. మీరు నన్ను ఎంతగానో ఆదరించారు, ఘనంగా స్వాగతం పలికారు, మహా గొప్పగా గౌరవించారు. మీరు ఎంతో భక్తీ ప్రపత్తులతో అల్లాహ్ ప్రసన్నతను, పరలోక సాఫల్యాన్ని కాంక్షిస్తూ ఉపవాసాలు పాటించారు. అయిదు పూటల నమాజుతోపాటు తరావీహ్ నమాజును స్థాపించారు. శ్రవణానందంతో ఖుర్ఆన్ పారాయణం చేశారు. ధన పిపాసకు స్వస్థి పలికి దానధర్మాలు చేశారు. నోటిని అదుపులో ఉంచుకున్నారు, లైంగిక కోర్కెలు అవి ధర్మసమ్మతమైనవైనా దూరంగా మసలుకున్నారు. మనో తుచ్ఛ కోర్కెలకు కళ్ళెం వేశారు. అల్లాహ్ ప్రసన్నతను, ప్రవక్త (స) వారి సహచర్యాన్ని, స్వర్గ సాఫల్యాన్ని ఆశిస్తూ అహర్నిశలు పరిశ్రమించారు. అల్లాహ్ మీ సదాచరణను, సత్కార్యాలను, ధర్మపరాయణతను అంగీకరించి మీరు కోరింది మీకు ప్రసాదించుగాక! ఆమీన్.

ఈ సందర్భంగా నేను మీకు కొన్ని మంచి మాటలు చెప్పదలిచాను. శ్రద్ధగా వాటిని విని, చిత్తశుద్ధితో ఆచరిస్తారని ఆభిలషిస్తున్నాను.

ఎట్టి గడ్డు స్థితిలోనయినా మీరు విశ్వకర్త అయిన అల్లాహ్‌కు సృష్టితాలలో ఎవరినీ భాగస్వాములుగా చేర్చకండి. అల్లాహ్‌ను కాదని ఇతరుల్ని అర్థించకండి. ఆయన్ను తప్ప ఎవ్వరినీ ఆరాధించకండి. మీకు మేలుగానీ, కీడుగాని తలపెట్టే శక్తి ఈ విశ్వం మొత్తంలో ఒక్క అల్లాహ్‌కు తప్ప మరెవ్వరికీ లేదని గట్టిగా నమ్మండి. అల్లాహ్ ఆజ్ఞల పరిధిలోనే జీవించేందుకు ప్రయత్నించండి. జీవిత చివరి ఘడియల వరకు, అంతిమ శ్వాస అనంత వాయువుల్లో కలిసిపోయేంత వరకు ఆయన ప్రీతి కోసమే పాటుపడండి. ఆయనకు నచ్చింది, ఆయన మెచ్చిందే చేయండి. ఆయనకు నచ్చనిది, ఆయన వద్దన్నవాటిని పరిత్యజించండి. ఇలా గనక మీరు చేస్తే ఇహపరాల సాఫల్యం, సౌభాగ్యం, శాంతి సుస్థిరతలు మీ ఇంటి చిరునామా తెలుసుకొని మరీ వచ్చి మీ ముంగిట వాలుతాయి.

అల్లాహ్ తర్వాత సృష్టిమొత్తంలో మీరు దైవ అంతిమ ప్రవక్త, మానవ మహోపకారి ముహమ్మద్ (స) వారి పట్ల అభిమానం కలిగి ఉండాలి. ఆయన జీవితంలో మీ అందరి కోసం అత్యుత్తమ ఆదర్శం ఉంది. జీవితంలోని అన్ని రంగాల్లో ఆయన్నే అనుసరించండి. ఒక కొడుకుగా, ఒక భర్తగా, ఒక తండ్రిగా, ఒక పౌరునిగా, ఒక నాయకునిగా, ఒక సేనానిగా, ఒక వ్యాపారవేత్తగా, ఒక న్యాయనిర్ణేతగా ఆయన పోషించిన పాత్రను సునిశితంగా పరిశీలించి తదనుగుణంగా మీ వ్యక్తిత్వాలను మలచుకోండి. మీరు మారేందుకు, ఇతరులను మంచి పౌరులుగా మార్చేందుకు మీ వంతు కృషి చేయండి. తద్వారా మీకు బలమైన వ్యక్తిత్వం ప్రాప్తమవడమేకాక తృప్తి, శాంతి లభిస్తుంది.

అల్లాహ్‌ను మరియు ఆయన అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స)ను విశ్వసించిన మీదట, విశ్వసించిన ఆ వ్యక్తి విశ్వాసం నికార్సయినదని నిరూపించే అద్వితీయ విధానం నమాజు. ఇది విశ్వాసానికి, అవిశ్వాసానికి, ఈమాన్‌కు కుఫ్రుకు మధ్య అడ్డుగోడ వంటిది. దీన్ని స్థాపించిన వారు ధర్మాన్ని స్థాపించిన వారుగా ఖ్యాతినొందుతారు, దీన్ని కూలదోసినవారు ధర్మాన్ని కూలదోసినవారుగా అపఖ్యాతిని మూటగట్టుకుంటారు. కాబట్టి నమాజుల పట్ల శ్రద్ధ వహించండి. మనిషికి సంబంధించిన సకల మేళ్లు ఒక్క నమాజులోనే ఉన్నాయన్న యదార్థాన్ని విస్మరించకండి. గమనించండి– అయిదు పూటల నమాజు, జుమా నమాజు ఈద్ నమాజు, తహజ్జుద్ నమాజు, తరావీహ్ నమాజు, ప్రయాణపు నమాజు, సూర్యగ్రహణ నమాజు, చంద్ర గ్రహణ నమాజు, సలాతుల్ హాజా, ఒక జఠిలమైన సమస్యను పరిష్కరించే నిమిత్తం చేసే నమాజు (ఇస్తిఖారా నమాజు), వర్షం కోసం చేసే నమాజు (ఇస్తిస్ఖా నమాజు), జనాజా నమాజు–ఇలా అమ్మ ఒడి నుండి మొదలు బడికెళ్ళేంత వరకు, బడి నుండి మొదలు గుడి (మస్జిద్)కెళ్ళేంత వరకూ, గుడి నుండి మొదలు మడికెళ్లేంత వరకూ, మడి నుండి మొదలు మట్టిలో కలిసిపోయేంత వరకు అనుక్షణం, అనునిత్యం మనిషికి రక్షగా నిలిచి, గొప్ప శిక్షణ ఇచ్చేది నమాజు. ఇహం, సంసారం అనే వారిధిని (సాగరాన్ని) దాటేందుకు అన్ని విధాల అనుకూలమైన వారధి నమాజు. అది మనిషి పాలిట శాపాలయిన అశ్లీల కార్యాల నుండి, అసభ్య ప్రవర్తనల నుండి, సిగ్గుమాలిన పనుల నుండి, నీతిమాలిన నియమాల చీకటి నుండి కాపాడే మిసిమి. అది మీ ఆత్మలకు శాంతిని, తృప్తిని ప్రసాదిస్తుంది. ఈ మహోన్నత ఆరాధన అయిన నమాజును విడనాడిన వాడు ఇటు మనశ్శాంతికి దూరమవడమే కాక అటు మరణించిన మీదట స్వర్గానికి వెళ్ళే అర్హతను కోల్పోయి భయంకర నరక కూపంలోకి నెట్టి వేయబడతాడు.

telgo Septemper.indd 20 8/22/11 3:54 PM

దైవం, దైవ ప్రవక్త (స) మరియు సమాజుల తర్వాత మీ విధేయత చూపవలసింది మిమ్మల్ని కనిపెంచి పెద్ద చేసిన మీ తల్లిదండ్రులకు. వారి విధేయతలోనే దేవుని విధేయత దాగుంది. వారి కోపం, అల్లాహ్ ఆగ్రహంగా మారుతుంది. కనుక వారితో మృదువుగా మెలగండి. వారిని కసురుకుంటూ మాట్లాడకండి. భార్యాపిల్లలకన్నా వారికే ఎక్కు ప్రాధాన్యతనివ్వండి. వారి కోసం సదా అల్లాహ్‌ను ఆయన నేర్పిన రీతిలోనే వేడుకోండి:

"ఓ మా ప్రభూ! నా తల్లిదండ్రులపై దయ జూపు. పసితనంలో వారు నన్ను కారుణ్యంతో, వాత్సల్యంతో పోషించినట్లు".

బంధువుల పట్ల మీ విధులను నిర్వర్తించండి. పెద్దలను గౌరవించండి. పిల్లలను ప్రేమించండి. వారు మీతో తెగతెంపులు చేసుకున్నా మీరు మాత్రం వారితో కలిసిమెలిసి ఉండేందుకు ప్రయత్నించండి. చిన్న చిన్న విషయాలపై రచ్చకు దిగి, బంధుత్వ సంబంధాల విచ్ఛిత్తికి పాల్పడకండి. **"నన్ను కలిపిన వారిని నువ్వు కలిపి ఉంచు. నన్ను త్రెంచిన వారిని నువ్వు త్రెంచు"** అని బంధుత్వం దైవంతో మొరపెట్టుకోగా ఆయన దాని మొరను ఆలకించాడని కొన్ని హదీసుల ద్వారా రూఢి అవుతుంది. అలాగే **"స్వల్ప ప్రయోజనాల కోసం బంధువులతో సంబంధాలు తెంచుకునేవారు స్వర్గంలో ప్రవేశించలేరు"** అని ప్రవక్త (స) హెచ్చరించి ఉన్నారు.

ఇరుగుపొరుగువారి పట్ల ఉత్తమంగా ప్రవర్తించండి. వారు ఏ మతస్థులైనా, ఏ వర్గానికి చెందినవారైనా సరే. చీటికీమాటికి పొరుగువారితో తగువులాటకు తిగేవారు, వారిని మాటలతో, చేతలతో వేదనకు గురి చేసేవారు, వారిపై లేనిపోని అపనిందలు మోపేవారు, వారి మహిళల మానాన్ని హరించేవారు సృష్టిరాసుల లోకెల్లా పరమ నీచాతినీచులు అని ప్రవక్త (స) చెప్పి ఉన్నారు. అలాగే **"తాము కడుపారా భోంచేసి కనీసం పొరుగువాని ఆకలిని పట్టించుకోని వ్యక్తి సంపూర్ణ విశ్వాసి కాలేడు"** అని కూడా ప్రవక్త (స) చెప్పినారన్న విషయాన్ని మరువకండి.

సమాజంలోని బడుగు వర్గాలను ఆదుకోవడంలో మీరు ముందుండాలి. అనాథలను ఆదరించాలి. వారికి ఆశ్రయాన్ని, విద్య సౌకర్యాన్ని కలుగజేయాలి. వితంతువుల యోగక్షేమాల పట్ల శ్రద్ధ వహించాలి. నిరుపేదల, అభాగ్యజీవుల, వికలాంగుల బాధను అర్థం చేసుకొని వారికి చేతనయినంత సహాయాం చేయాలి. సమాజంలోని అన్ని వర్గాల పట్ల దయ, జాలి, క్షమ, పరోపకార భావం కలిగి ఉండాలి. దైవ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: **"మీరు అవనిపై ఉన్న అభాగ్యజీవుల పట్ల కరుణ కలిగి ఉంటే, ఆకాశంలోనున్నవాడు (అల్లాహ్) మిమ్మల్ని కనికరిస్తాడు".**

నీతికి విలువ ఇవ్వండి. నాతికి నిండు వలువలు ధరింప జేయండి. న్యాయానికి, ధర్మానికి కట్టుబడి జీవించండి. కొలతలలో, తూనికలలో తగ్గించి ఇచ్చే ప్రయత్నం మానండి. పేదల నడ్డి విరగ్గొట్టే వడ్డీ గడ్డి తినే సాహసం చేయకండి. దోపిడి, దొంగతనాలకు పాల్పడకండి. లంచంగొండితనానికి కడుదూరంగా మసలుకోండి. కుటుంబ జీవనాన్ని కుప్పకూల్చే మద్యపానం, మగువ లోలత్వం, జూదం, మాదకద్రవ్యాల సేవనాన్ని పరిత్యజించండి.

వ్యభిచారం దరిదాపులకు కూడా పోకండి. చెడుని అన కండి, వినకండి, కనకండి. యువతీయువకుల స్వేచ్ఛాయుత కలయికను ఖండించండి. మనిషిలోని మనసులోన నిదురించే దానవునికి చురక పెట్టి లేపే దుస్తులు, ప్యాషన్‌షోలు, సినిమాలు, శృతి మించిన సంబరాల్ని అరికట్టండి.



అల్ప బుద్ధి, అంటరానితనం, వర్గ దురభిమానం, జాత్యాహంకారం, మతోన్మాదం, ఉగ్రవాదం మానవతకే ఓ కళంకం. ఇవి నాటి నుండి నేటి వరకూ మారణహోమాన్ని రగిలిస్తూనే వస్తున్నాయి. రక్తపాతాలకు దారి తిస్తూనే ఉన్నాయి. కనుక వీటిని ఎన్నటికీ సమర్థించకండి. సమాజంలో అలజడిని, అరాచకాలను రేకెత్తించే దుష్టశక్తుల, శాంతి విఘాతకుల ఆగడాలను అరికట్టండి.

విశ్వ ప్రభువైన అల్లాహ్ మిమ్మల్ని **'శ్రేష్ఠ సమాజం'**గా అభివర్ణించాడు. **'మంచిని పెంచడం, చెడుని తుంచడా'**న్ని మీ ఉనికి లక్ష్యంగా పేర్కొన్నాడు. **'ముస్లింలు'** అని మిమ్మల్ని నామకరణం చేశాడు. ముస్లిం అంటే ఎవరు? ముస్లిం అంటే తన నోటితో గానీ, తన చేతితోగాని ఏ ఒక్కడిని హాని తలపెట్టనివాడు. దైవ ఆదేశాలకు తలొగ్గి జీవించేవాడు, సమస్త జీవరాసుల క్షేమాన్ని, శ్రేయాన్ని కాంక్షించేవాడు. జనులందరి – తన, ధన, మానాలను కాపాడే అంగరక్షకుడు. కనుక మీరు బ్రతికినంత కాలం శాంతిప్రియులుగా, ముస్లిములుగానే జీవించండి. ముస్లింలుగానే మరణించండి. ఇదే నేను మీ నుండి కోరే దక్షిణ.

ఇక నేను మీ నుండి సెలవు తీసుకుంటున్నాను. దైవ చిత్తమయితే వచ్చే ఏడాది తిరిగి వస్తాను. మీతో తప్పకుండా కలుస్తాను. నా రాకకు ముందే మీలో ఎవరైనా కాలధర్మం చెంది – మరణించి దైవ సన్నిధికి చేరుకుంటే, స్వర్గ ద్వారాలలో ఒకటైన **'రయ్యాన్'** ద్వారం (ఇది ఉపవాస దీక్షకుల కోసం ప్రత్యేకం) వద్ద వారి కొరకు ఎదురు చూస్తూ ఉంటాను.

వస్సలాము అలైకుమ్ రహ్మతుల్లాహి వ బరకాతుహు...

....ఫీ అమానిల్లాహ్!

telgo Septemper.indd 21 8/22/11 3:54 PM

IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية

ఆసిమా బ్రాంచ్ ఆధ్వర్యంలో 'రమజానుకు స్వాగతం'

ఐపిసి ఆసిమా బ్రాంచ్ తెలుగు సెక్షన్ ఆధ్వర్యంలో 29-07-2011 వ తేదీ శుక్రవారం నాడు ఉమైరియాలోని జంతు ప్రదర్శనాశాలలో విహారయాత్ర కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ సందర్భంగా ప్రియ సోదరులు ఉస్మాన్ గారు ఖుర్ఆన్ పారాయణం చేయగా, **'రమజానుకు స్వాగతం'** అన్న అంశం మీద ఐపిసి ప్రబోధకులు సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ గారు ప్రసంగించారు.





ఐపిసి ఆధ్వర్యంలో 'ఇఫ్తార్ విందు' ఏర్పాటు





దాదాపు ఐపిసి అన్నీ బ్రాంచీల్లోనూ వివిధ భాషలు మాట్లాడే, వివిధ దేశాలకు చెందిన న్యూ ముస్లింల కోసం ప్రతి రోజు ఇఫ్తార్ ఏర్పాటు ఆధ్యాత్మిక వాతావరణంలో చేయబడుతోంది. ప్రతి రోజు 1500 వందలకుపైగా వ్యక్తులు ఐపిసికి చెందిన వివిధ బ్రాంచీల్లో తమ ఉపవాసాన్ని విరమిస్తారు. అలాగే ఈ ఏడాది కొన్ని ముఖ్యమైన పుస్తకాలతో కూడిన రమజాన్ కాంప్లిమెంట్ ప్యాకేజీని న్యూ ముస్లింలందరికి అందజేయడం జరిగింది.











telgo Septemper.indd 22 8/22/11 3:54 PM

భావోద్రేక వ్యక్తిత్వాన్ని అంచనా కట్టండి!

మనిషి మానసిక స్థితిని అంచనా వేసేందుకు, అతనిలో దాగి ఉన్న ప్రతిభాపాటవాలను, పండిత ప్రకర్షను వెలికి తీసి మంచి మార్గంలో వినియోగించేందుకు మానసిక శాస్త్రవేత్తలు చేసిన కృషి శ్లాఘనీయం. దీనికిగాను వారు చూపిన పద్ధతులు నూటికి నూరుపాళ్లు నిజం కాకపోవచ్చు. కానీ వీటి ద్వారా మనం ఒక నిర్ణయానికి రాగలమన్నది మాత్రం నిర్వివాదాంశం.

(ఎ) కి 2 (బి)కి 5 (సి)కి 1 చొప్పు మార్కులు వేసుకోవాలి. మొత్తం మార్కులు 35 నుండి 50 వరకు వస్తే మీ భావోద్రేకాలు అదుపులో ఉన్నాయని, మీరు గుణవంతులని అర్థం. 20 నుండి 34 వరకు వస్తే మీ భావోద్రేకాలు తీవ్రస్థాయిలో ఉన్నాయని అర్థం. కాస్త శ్రద్ధ వహిస్తే ఇంద్రియ నిగ్రహం సాధించి గొప్పవారుగా రాణించగలరు. 19కన్నా క్రింద ఉంటే మీలో అస్సలు సామాజిక స్పృహ, స్పందించే హృదయం లేనట్టే లెక్క.



మీ పై అధికారి మీతో అనుచితంగా వ్యవ హరించినప్పుడు-

ఎ) ఆ రోజంతా లేదా చాలా రోజుల వరకు బాధ పడుతుంటారు. మీకప్పగించిన పనిని మీరు చేయలేరు.

బి) ఆ క్షణంలో లేదా కాసేపు వరకు గిల్టీగా ఫీలవుతారు. కానీ మీ పని మీరు చేయగలుగుతారు.

సి) మీరు ఎలాంటి భావోద్రేకాలకు లోను కారు. పని చెయ్యడంలో లీనమైపోతారు.



మీరు ఒక నిరుపేదను, ఒక అనాథను, ఒక అవసరార్థుడ్ని చూసినప్పుడు -

ఎ) అతని స్థితిని చూసి సుదీర్ఘ కాలం జాలి పడటంతో పాటు చేతనైనంత సహాయం చేస్తారు

బి) ఆ క్షణం బాధపడతారు. సహాయం చేసిన మీదట సంతృప్తి చెందుతారు.

సి) మీరు ఎలాంటి భావోద్రేకానికి లోను కారు. బహుశా ఆ వ్యక్తి మోసగాడు, అబద్ధాలకోరై ఉండొచ్చని భావిస్తారు.



ప్రజల సమక్షంలో ఇబ్బందికరమైన స్థితిని ఎదుర్కోవలసి వస్తే -

ఎ) తీవ్ర భావోద్రేకానికి లోనై మళ్ళీ అటువంటి వారి ముఖం చూడను అని నిర్ణయించుకుంటారు.

బి) భావోద్రేకానికి లోనవుతారు కానీ, మిమ్మల్ని మీరు కంట్రోల్ చేసుకునేందుకు ప్రయత్నిస్తారు.

సి) ఆ సంఘటన గురించి అస్సలు పట్టించుకోరు. ఇది సర్వసాధారణమేనని కొట్టి పారేస్తారు.



ఒక బలవంతుడు ఒక బలహీనుణ్ణి హింసించడం చూశారు, కానీ అతని దుర్మార్గాన్ని ఆపే శక్తి మీలో లేదు. అప్పుడు -

ఎ) బోరుమని విలపిస్తారు. ఆరోగ్యం పాడు చేసుకుంటారు.

బి) బాధితునితో మృదువుగా వ్యవహరిస్తారు. మీరు చేయగలిగింది చేస్తారు.

సి) ఎలాంటి శ్రద్ధ కనబర్చరు. లోకంలో హతులు, హంతకులు మామూలే అనుకుంటారు.

ఒక బాధాకరమైన గాధ విన్నప్పుడు -

ఎ) చాలా సేపు వరకు ఏడుస్తూనే ఉంటారు.

బి) ఆ సమయంలో బాధ పడతారు తర్వాత పూర్వ స్థితికి చేరుకుంటారు.

సి) అది మీకు సంబంధించిన విషయం కాదు కనుక దాన్ని అస్సలు పట్టించుకోరు.



ముందుగానే నిర్ణయించబడిన సమయం ప్రకారం మీ దగ్గరి బంధువులను కలుసుకునేందుకు బయలుదేరుతున్నప్పుడు మీ స్నేహితుడో, మీ పొరుగువాడో సలహా కోరుతూ మీ దగ్గరకు వస్తే -

ఎ) వారికి నచ్చినంత సేపు వారితో కూర్చొని వారి సమస్యను పరిష్కరిస్తారు.

బి) వారిని సాదరంగా స్వాగతించి వారు చెప్పింది విని, మరో అర్జంటు మీటింగుందని వారికి చెప్పి బయలు దేరతారు.

సి) వారితో సారి చెప్పి ఎలాంటి ఆహ్వాన పలుకులు చెప్పకుండా మీ పని మీద మీరు వెళ్ళిపోతారు.



మీ స్నేహితుని విషంలోగానీ, మీ బంధువుల విషయంలో గాని మీ వల్ల పొరపాటు దొర్లినప్పుడు

ఎ) మిమ్మల్ని మీరు నిందించుకోవడంతోపాటు, మీకు మీరుగా శిక్ష విధించుకుంటారు.

బి) మానసికంగా వారు ప్రశాంతులయినంత వరకు వేచి చూసి సారీ చెబుతారు.

సి) ప్రతి వ్యక్తితో తప్పు జరుగుతుందని భావించి ఆ విషయాన్ని అస్సలు పట్టించుకోరు.

మీ కార్యాచరణ సమయంలో ఏదైనా సహాయం చేయాల్సిందిగా మీ స్నేహితుడు కోరినప్పుడు -

ఎ) పూర్తి సమయాన్ని అతని కోసమే కేటాయిస్తారు.

బి) మీ సమయంలో కొంత భాగాన్ని అతని కోసం కేటాయిస్తారు, అలా మీ పని ఆగకుండా ఉండేలా చూసుకుంటారు.

సి) మీ పని పూర్తి కానంత వరకు ఎవరికి ఎలాంటి సహాయం చెయ్యరు.

మీరో వ్యక్తితో కలిసి అతన్ని స్నేహితునిగా చేసుకోవాలనిపించినప్పుడు-

ఎ) అతని పట్ల మీకున్న అభిమానాన్ని కాస్త అతిగా ప్రదర్శిస్తారు.

బి) నిజాయితిగా, సరైన రీతిలో మీ భావావేశాల్ని అతనితో షేర్ చేసుకుంటారు.

సి) మీ భావావేశాల్ని బయట పడనీయరు. అతనే ముందుకొచ్చి స్నేహం చేయాలని కోరుకుంటారు.



ఇంట్లోగాని, కార్యాలయంలోగాని మీ క్రింద పని చేసే వ్యక్తి రోగగ్రస్థుడై అతనికి 5 వేల అవసరం ఉండి , మీ వద్ద కూడా 5 వేలు తప్ప ఏమి లేనప్పుడు-

ఎ) అతని పట్ల సానుభూతిని కనబర్చడంతోపాటు మొత్తం పైకాన్ని అతనికి ఇచ్చివేస్తారు.

బి) అందులో కొంత పైకాన్ని అతనికిచ్చి మిగతాది మీ కుటుంబం కోసం ఎత్తిపెడతారు.

సి) మీకు, మీ ఇంటి వారికి అవసరం ఉన్నంత వరకూ ఒక్క పైసా కూడా అతనికివ్వరు.

telgo Septemper.indd 23 8/22/11 3:54 PM


برعاية
الأمانة العامّة للأوقاف
పరిచయం.....బాధ్యత
మీరు అల్లాహ్ వైపు పిలిచే ప్రబోధకులు కండి
మా సందేశం.....
అల్లాహ్ వైపు ఆహ్వానం.....దాన్ని మాతోపాటు అందజేయండి
◆ మేము 14 భాషల్లో ఇస్లామీయ ప్రసార సాధనాల్ని మరియు వేర్వేరు భాషలు వట్లాడే 75 మంది బోధకుల్ని మీకు అందజేస్తాము.
◆ ఇస్లాం ధర్మ స్వీకార ప్రకటన ఏర్పాటు
◆ ధార్మిక శిక్షణా తరగతులు, ఖుర్ఆన్ ప్రబోధనా తరగతులు, అరబీ భాష నేర్పించే సౌకర్యం కలుగజేస్తాము.
◆ ముస్లిమేతర సోదరుల కొరకు ఇస్లామీయ సాహిత్యాన్ని వారి స్వస్థలానికి చేరవేస్తాము.
◆ జాప్రో నుంచి మొదలు వఫ్రా వరకు 15 బ్రాంచీలు గలవు
IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية
22444117 EX:151 మాకు కాల్ చేయండి
సమస్త లోకాల పాలిట మూర్తీభవించిన కారుణ్యం http://ipcblogger.net/telugu/
Al-Roudaa Al-Salmiya Al-Sabahia Al-Khaitan Al-Mangaf Al-Jahraa Al-shohadaa Main Branch
22511301 25733263 23620332 24711141 23723002 24558830 25231015 22444117